



# విజయభాను






హైదరాబాద్, మంగళవారం 10-10-2017 | VIJAYABHANU DAILY HYDERABAD EDITION | సంపుటి : 37 సంచిక : 27 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# బ్లాక్‌చైన్‌తో అద్భుతాలే

- బ్లాక్‌చైన్‌తో అద్భుతాలే
- ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కాలమిది ..
- సాంకేతికతను బలంగా నమ్మిన వ్యక్తిని నేను
- హాజరైన 25 దేశాల, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు
- వివిధ కంపెనీల సీఈవోలతో ముఖాముఖి
- ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు

### సాంకేతికతను బలంగా నమ్మిన వ్యక్తిని నేను

తొలి నుంచి తాను సాంకేతిక పరిజ్ఞానాన్ని గట్టిగా నమ్మానన్నారు. భవిష్యత్తంతా సాంకేతిక పరిజ్ఞానానిదేననడంలో ఏమాత్రం సందేహం లేదన్నారు. బ్లాక్‌చైన్, ఐవోటీ, సమాచార నిర్వహణ, బయోమెట్రిక్, సమాచార దృశ్యీకరణ .. ఇలా పేరేదైనా సాంకేతికతను తమ ప్రభుత్వం ఉపయోగించుకోవాలనుకుంటోందన్నారు. పేదరికాన్ని నిర్మూలించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.




### ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కాలమిది ..

హ్యాకింగ్ ముప్పు నుంచి సమాచారాన్ని కాపాడటానికి ఈ పరిజ్ఞానం ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం మనం నాలుగో పారిశ్రామిక విప్లవం వైపు అడుగులేస్తున్నామని, ఇది ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కాలమని, ఏ పనిచేయాలన్నా వాస్తవ కాలంలో చేయొచ్చని తెలిపారు. ఈ సాంకేతిక పరిజ్ఞానంలో భద్రత, నమ్మకం ముఖ్యమని తరువాయి 2లో

విశాఖపట్నం: బ్లాక్ చైన్ పరిజ్ఞానంతో భవిష్యత్తులో అద్భుతాలు సృష్టించవచ్చని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.

సోమవారం విశాఖలో నిర్వహించిన అంతర్జాతీయ బ్లాక్ చైన్ సదస్సును ఆయన ప్రారంభించారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ సదస్సుకు 25 దేశాలు, వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీఎం వివిధ కంపెనీల సీఈవోలతో ముఖాముఖిలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. బ్లాక్ చైన్ నిపుణులందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు ఈ సదస్సు నిర్వహించినట్టు చెప్పారు.




# అవినీతి భరతం పడతాం

- లంచం అడిగేటోళ్ల పనిపట్టండి
- త్వరలో సింగరేణి యాత్ర చేపడుతా..
- సింగరేణి తెలంగాణ కొంగు బంగారం
- త్వరలోనే పే రివిజన్ కమిటీ
- పెరిగే జీతాల కోసం రూ.370కోట్లు..
- బయ్యారం గనులు సింగరేణికే
- సింగరేణి కార్మికులతో ఆత్మీయ సమ్మేళనంలో సీఎం కేసీఆర్



హైదరాబాద్: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సింగరేణి కార్మికులపై మరోసారి వరాల జల్లు కురిపించారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని చెప్తూనే.. కొత్తవి కూడా ప్రకటించారు. డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వడంతోపాటు, రూ.10లక్షల వరకు వడ్డీలేని ఇండ్ల రుణాలు, మెడికల్‌బోర్డు ప్రక్షాళన, క్వార్టర్లకు ఏసీలు, పిల్లల ఉన్నతవిద్యకు ఖర్చు, అంబేద్కర్ జయంతికి సెలవు, యూనియన్ సభ్యత్వ రుసుం రూపాయికి తగ్గింపు వంటి వరాలు ప్రకటించిన సీఎం.. ఏండ్ల నుంచి వేళ్లూనుకుపోయిన అవినీతి భరతం పడుతామని ప్రతినబూనారు. ఆదివారం ప్రగతిభవన్‌లో ఆయన సింగరేణి కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగించారు. లంచం అడిగినోళ్లను, తీసుకొనేటోళ్లను చెప్పుతో కొట్టాలని ముఖ్యమంత్రి అన్నారు. మెడికల్ అన్‌ఫిట్ నుంచి క్వార్టర్ల కేటాయింపు వరకు ప్రతిపనిలో గత పాలకులు లంచాలు తీసుకోవడం ప్రారంభించారని, ఇకనుంచి ఆ సంస్కృతికి చరమగీతం పాడుదామని కార్మికులకు పిలుపునిచ్చారు. లంచం అంతం చేయాలని పలుమార్లు కోరిన సీఎం కేసీఆర్ ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థ ప్రారంభిస్తామని కూడా ప్రకటించారు. అక్రమాలకు, లంచాలకు నిలయంగా మారిన సింగరేణి మెడికల్ బోర్డును ప్రక్షాళన చేస్తామని చెప్పారు.

ఇన్నాళ్లు సింగరేణిని పట్టించుకోలేదని, ఇకనుంచి తామేమిటో చూపిస్తామని, కార్మికుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తామన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ సంఘాలు, పార్టీలు మాత్రమే గెలుస్తున్నాయని చెప్పిన సీఎం కేసీఆర్.. ఈసారి గెలుపు కార్మికులదని, వారికి ప్రతిఫలం దక్కాలన్నారు. కార్మికుల సమస్యలు తెలుసుకొనేందుకు స్వయంగా సింగరేణి యాత్ర చేపడుతానని, ప్రతి క్వార్టర్ తిరిగి కార్మికులను కలిసి సమస్యలు విని, ఒక్కొక్కటి పరిష్కరించుకొంటూ ముందుకు పోతానని హామీ ఇచ్చారు. గతంలో సింగరేణి ఎన్నికల్లో గెలిచిపించినప్పటికీ ఏమీచేయలేకపోయామని.. ఇకనుంచి తరువాయి 2లో

## హక్కుల సాధనకు
# ఐక్య ఉద్యమం

- డిసెంబరు 17న ఓసీ మహాగర్జన
- ఐకాస రాష్ట్ర ఇన్‌ఛార్జి పోలాడి రామారావు

కరీంనగర్ : అగ్రకులాల సామాజిక వర్గీయుల హక్కుల కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధమవుతున్నామని, ఇందుకోసం కార్యాచరణ రూపొందిస్తున్నామని ఓసీ సంక్షేమ సంఘాల సమాఖ్య రాష్ట్ర ఇన్‌ఛార్జి పోలాడి రామారావు అన్నారు. కరీంనగర్‌లో ఐకాస ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తమ సామాజికవర్గంలో 80 శాతం పేదలు ఉన్నారని, అయినా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. అన్ని పార్టీలు ఓసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని పేర్కొన్నారు. ఇతర కులాల్లోని పేదలకు అమలు చేస్తున్నట్లుగానే అగ్ర కులాల్లోని పేదలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రతిభ ఉన్నా.. 90 శాతం మార్కులు వచ్చినా ఓసీ విద్యార్థులకు ఉన్నత విద్యకు సీట్లు లభించడంలేదన్నారు. పదేళ్ల కాలపరిమితితో ముగియాల్సిన రిజర్వేషన్లు నేటికీ కొనసాగుతున్నాయని.. దీంతో ఓసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తాము ఏ కులానికి, మతానికి వ్యతిరేకం కాదని ఆర్థిక ప్రాతిపదికన అన్ని వర్గాల్లోని పేదలకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. అప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ఓసీల స్థితిగతులపై అధ్యయనం చేయడానికి చట్టబద్ధతతో కూడిన కమిషన్ వేయాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి నెలకు ఐదువేలు పెన్షన్ ఇవ్వాలని, పదివేల కోట్లతో ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు రాయితీ రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు.

ఆదర్శ, కస్తూర్బా, రెసిడెన్షియల్, గురుకుల పాఠశాలలో 19 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, స్టడీ సర్కిళ్లు, వసతి గృహాలు ఏర్పాటు చేయాలని అన్నారు. తమ డిమాండ్ల సాధనకు డిసెంబర్ 17న కరీంనగర్‌లో 2 లక్షల మందితో ఓసీ మహాగర్జన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో రాధాకృష్ణారెడ్డి, స్వామిరెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## గోద్రా రైలు దహనం కేసులో
# శిక్ష తగ్గింపు

- 11 మంది ఉరిశిక్షను జీవితఖైదు చేసిన కోర్టు
- మళ్లీ నిర్దోషిగానే కీలక సూత్రధారి



( ఫైల్ ఫోటో )

అహ్మదాబాద్: గోద్రా రైలు దహనం కేసులో గుజరాత్ హైకోర్టు సోమవారం కీలక తీర్పు వెల్లడించింది. ఈ కేసులో 11 మంది దోషులకు పడిన ఉరిశిక్షను జీవితఖైదుకు తగ్గిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది. కాగా.. రైలు దహన ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో ప్రభుత్వం విఫలమైందంటూ కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆరు వారాల్లోగా బాధిత కుటుంబాలకు ఈ నష్టపరిహారాన్ని చెల్లించాలని సూచించింది.

2002 ఫిబ్రవరి 27న గుజరాత్‌లోని గోద్రాలో ఈ ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. అయోధ్య నుంచి అహ్మదాబాద్‌కు వస్తున్న సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌పై గోద్రా స్టేషన్ వద్ద ఆందోళనకారులు దాడి చేశారు. ప్రయాణికుల్లో చాలా మంది విశ్వహిందూ పరిషత్ తరపున అయోధ్యలోని పూర్ణాహుతి మహా యాగంలో పాల్గొని తిరిగివస్తున్నారు. ఆ సమయంలో దాదాపు 2000వేల మంది ఆందోళనకారులు తరువాయి 2లో

# జమ్ముకశ్మీర్‌లో మరో కీలక ఉగ్రవాది హతం



శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని బారాముల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో కీలక ఉగ్రవాదిని భద్రతాసిబ్బంది హతమార్చారు. సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ ఆపరేషనల్ హెడ్ అబు ఖలీద్‌ను మట్టుబెట్టినట్లు అధికారులు వెల్లడించారు. తరువాయి 2లో






## టేకిట్ ఈజీ




సాంకేతిక భద్రత, పరిజ్ఞానం, నమ్మకం బాబుగారి మూడు సూత్రాలట!!

# వైఎస్ జగన్ పాదయాత్రపై త్వరలో కీలక సమావేశం!

హైదరాబాద్: నవంబర్ 2వ తేదీ నుంచి తాను చేపట్టనున్న పాదయాత్రపై వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం (ఈ నెల 11న) కీలక సమావేశం నిర్వహించబోతున్నారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, జిల్లా పరిశీలకులు, నియోజకవర్గ సమన్వయకర్తలకు ఈ సమావేశానికి హాజరుకావాల్సిందిగా పిలుపు అందింది.

వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న పాదయాత్ర ఏర్పాట్లు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈ మేరకు పార్టీ నేతలకు ఎంపీ విజయసాయిరెడ్డి సమాచారం అందించారు.

పాదయాత్ర కార్యాచరణ గురించి చర్చించే.. ఈ సమావేశానికి ఆహ్వానం అందిన నేతలందరూ తప్పకుండా రావాలని ఎంపీ విజయసాయిరెడ్డి సూచించారు.



# సమస్యల పరిష్కారానికి ఐక్యంగా సాగుదాం



బ్రహ్మపుర : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక విధానాలకు వ్యతిరేకంగా, సమస్యల పరిష్కారానికి అంతా ఐక్యంగా ముందుకు సాగుదామని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పండా పిలుపునిచ్చారు. ఒడిశా నిర్మాణ శ్రామిక సంఘం(ఓఎన్ఎస్ఎస్) గంజాం జిల్లా శాఖ మూడో సమ్మేళనం ఆదివారం జరిగింది. స్థానిక అస్కారోడ్డులోని చతుర్భుజ ధర్మశాల ఆవరణలో జరిగిన సమ్మేళనానికి అతి థిగా హాజరైన రామకృష్ణ పండా మాట్లాడుతూ తప్పుడు హామీలిచ్చి కేంద్రంలో భాజపా ఆధ్వర్యంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు.

ప్రధాని మోదీ హయాంలో దేశంలో నిరుద్యోగం మరింత పెరిగిందని, ప్రజలు ఉపాధి కోల్పో యారని చెప్పారు. మహిళలపై దారుణాలు, వెనుకబడిన వర్గాలు, అల్ప సంఖ్యాకులపై దాడులు అంత కంతకూ పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కర్మాగారాలు మూతబడ్డాయని, కార్మికులు ఉపాధి కోల్పోయారని రామకృష్ణ పండా పేర్కొన్నారు. పంచానన స్వయిన్, దండపాణి సామల్, జయరాం దాస్‌లు సమన్వయకర్తలుగా వ్యవహరించిన ఈ సమ్మేళనంలో అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శౌరిబంధు కర్, నిర్వాహక ఓఎన్ఎస్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రశాంత పట్టజోషి, సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రకాష్ పాత్ర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బృందావన పాళాయి, ప్రదీప్ సెఠి, కామదేవ్ నాహక్, రామచంద్ర పండా తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నిర్మాణ రంగ కార్మికుల పేర్ల నమోదుకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని వారు చెప్పారు. కార్మికశాఖ కార్యాలయాల్లో పేర్ల నమోదుకు అవసరమైనంత సిబ్బంది, సాధనా సంపత్తి లేదని వారు పేర్కొన్నారు. వచ్చే 17న బాలేశ్వర్‌లో ఓఎన్ఎస్ఎస్ రాష్ట్ర సమ్మేళనం జరుగుతుందని, దీనికి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు హాజరవ్వాలని వారు పిలుపునిచ్చారు. రోజంతా జరిగిన ఈ సమ్మేళనంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు, ఇతర కార్మిక సంఘాల నాయకులు తదితరులు హాజరయ్యారు.

## రచనల్లో జవాబుదారీతనాన్ని ప్రోత్సహించాలి

రాయచూరు : కృత్రిమ సమాజంలో, నాలుగు గోడల మధ్య జీవనం సాగిస్తున్న వారిని సాహితీవేత్తలు, రచయితలు తమ రచనల ద్వారా మేల్కొలపాలని గంగావతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముఖ్యస్తుడు డాక్టర్ జాజి దేవేంద్రప్ప పిలుపునిచ్చారు. ఇక్కడి పత్రికా భవన్‌లో సాహితీవేత్త వీరహనుమాన్ రచించిన గోరవంక పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. దేవేంద్రప్ప మాట్లాడుతూ కొన్ని విషయాలపై మాట్లాడాలంటే జంకే పరిస్థితి ప్రస్తుతం ఉందన్నారు. వీటిపైనా దృష్టి పెట్టి సమాజ చైతన్యానికి ప్రయత్నించాలన్నారు. ప్రతి రచనలో జవాబుదారీతనాన్ని ప్రోత్సహించా లన్నారు. కువెంపు తర్వాత పరిసర తత్వాలు, ప్రకృతి పట్ల వివేకంతో ఆలోచించే రచనలు పెద్దగా రాలే దన్నారు. గోరవంక పుస్తకంలో ఆయా అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయ మన్నారు. కన్నడ భాష, సంస్కృతులు మనుగడ కోల్పోకుండా ఎంతో మంది కృషి చేస్తున్నారని కొనియాడారు. కన్నడ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు మహంతేశ్ మస్కి మాట్లాడుతూ రాయచూరుకు చెందిన సాహితీవేత్తలు ఎందరో రాష్ట్ర స్థాయిలో పేరు గడించారని, రాష్ట్ర స్థాయి పురస్కారాలు తెచ్చుకున్నారని తెలిపారు. దీనిని బట్టి జిల్లాలో సాహిత్యానికి గట్టి పునాది ఉందని తెలుస్తోందన్నారు.

గజల్, విప్లవ సాహిత్యాలకు ఇక్కడ కొదవలేదని చెప్పారు. కసాప మాజీ అధ్యక్షుడు శరణేగౌడ, ఈరణ్ణ బెంగాలి, అయ్యప్ప తుకాయి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీల్లో ఇతరులను చేర్చడం అన్యాయం

గంగావతి : ఇతర కులాలను ఎస్టీల్లో చేర్చడం అన్యాయమని కర్ణాటక రక్షణ వేదిక జిల్లాధ్యక్షుడు పంపణ్ణ నాయక్ అన్నారు. సంగాపుర గ్రామంలో జరిగిన వాల్మీకి జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్టీ రిజర్వేషన్ల శాతాన్ని పెంచి ఇతరులను చేర్చితే తమకు అభ్యంతరం లేదన్నారు. అలా చేయక అందరినీ ఎస్టీలుగా ప్రకటిస్తే వాల్మీకులకు అన్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తమ సామాజిక వర్గాన్ని ఎస్టీల్లో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రయత్నాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. దీనికి పూర్వం వాల్మీకి చిత్రపటానికి పూజలు చేసి వూరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో జోగద్ హన్మంతప్పనాయక్, సురేశ్, హంపేశ్ హరిగోల్, సిద్ధరామస్వామి, తిప్పేరుద్రస్వామి పాల్గొన్నారు.

## వసతిగృహం భోజనంలో జెర్రి

చెన్నై : వసతిగృహంలో విద్యార్థులకు వడ్డించిన భోజనంలో జెర్రి కనిపించడంతో కలకలం రేగింది. చెన్నై అన్నాసాలై సైదాపేట్టయ్ ప్రాంతంలో ఎంసీ రాజా ఆదిద్రావిడర్ వసతిగృహం ఉంది. పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ఇక్కడ ఉంటున్నారు. నాణ్యతలేని భోజనం పెడుతున్నారని వారు కొన్నాళ్లుగా ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో భోజనం వడ్డిస్తుండగా అందులో జెర్రి రావడంతో విద్యార్థులు ఆగ్రహించారు. వార్డెన్, వంట వారిని ప్రశ్నించగా సరిగ్గా బదులివ్వకపోవడంతో అన్నాసాలైలో ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి చర్చించారు. అనంతరం సంబంధిత అధికారులు వచ్చి ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

## అక్రమ కబేళాలపై భాజపా పోరాటం



బెంగళూరు : బెంగళూరు నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో అక్రమ కసాయి శాలల మూసివేతకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మౌర్య కూడలిలోని గాంధీ విగ్రహం ఎదుట భాజపా గోసం రక్షణ ప్రతోష్ఠ నేతృ త్వంలో కార్యకర్తలు గోవుతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా భాజపా శాసన సభ్యుడు సీటీ రవి మాట్లాడుతూ రాష్ట్రంలో గోహత్య నిషేధ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. భాజపా అధి కారంలోకి వస్తే ఆ చట్టాన్ని తక్షణం అమలులోకి తెస్తామని హామీ ఇచ్చారు. అందుకు అన్ని పార్టీలు సహకరించాలని సూచించారు. మహాత్మాగాంధీ గోవును తల్లిగా భావించి, గోహత్యను వ్యతిరేకించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలు గాంధేయ వాదులుగా చెప్పుకుంటూ ఆయనకు ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ గోహత్యను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు.

## ఏనుగుల సంచారంతో భయాందోళన

ఖరగ్‌పూర్ : పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా సాల్బోనీ పరిధిలోని పలు గ్రామాలలో ఏనుగులు సంచారంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 60 ఏనుగుల గుంపు కొద్దిరోజులుగా ఈ ప్రాంతంలో సంచరిస్తుండగా వాటిని తరిమేందుకు పలు గ్రామాలకు చెందిన ప్రజలు కృషి చేస్తున్నారు. ఏనుగులు పంట పొలాలలో పడి పంట నాశనం చేస్తున్నాయి. మూడు రోజులుగా సాల్బోనీ పరిధిలోనే తిరుగుతున్న ఇవి చితాడిహికు చెందిన కాశీనాథ్ పాల్ అనే వ్యక్తిని గాయపర్చాయి. సాల్బోనీ వనవిభాగం సిబ్బంది బృందాలుగా వెళ్లి ఏనుగులను తరిమే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు వీరి శ్రమ ఫలించలేదు.

## కఠోర శ్రమతోనే ఉద్యోగసాధన

రాయచూరు : కఠోర పరిశ్రమతోనే పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం సాధ్యమని సదరబజార్ పీఎస్సై ఉమేష్ కాంబ్లే పేర్కొన్నారు. పోటీ పరీక్షలను ఎలా ఎదుర్కోవాలనే విషయమై సదర్‌బజార్ ఠాణాలో సదస్సు జరిగింది. ఇందులో పాల్గొన్న ఉమేష్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగానికి ఎంతో పోటీ ఉందని, కనుక కష్టపడి చదవడంతో పాటు పరీక్ష రాయడంలో మెలకువలు తెలుసుకోవాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులు పోటీ పరీక్షల సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం వివిధ ఉద్యోగాలకు ప్రకటన విడుదల చేసినందున ఇప్పటి నుంచే తయారు కావాలని కోరారు. ఉద్యోగం తెచ్చుకోవాలన్న పట్టుదలతో చదవాలని కోరారు. పుస్తకాలు చదడం, సీనియర్ల సలహాలు, నిపుణుల సలహాలు తీసుకోవాలని కోరారు. చాళుక్య అకాడమీ సంస్థకు చెందిన సంగమేష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

## లోహర్ని దేవి ఉత్సవాలకు ఏర్పాట్లు



పర్లాఖెముండి : గజపతి జిల్లా గుసానిసమితి ముధుసధన పురం పంచాయతీ బట్టిసిరిపురం ఈ నెల 11 నుంచి 25 వరకు గ్రామంలో లోహర్ని దేవత ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వా హకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడి ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. మారుమూల ఈ కుగ్రామానికి ఉత్సవం చివరి రోజున వేలాదిమంది భక్తులు తరలివస్తారు. ఆరోజు పూజారి చేసే ప్రదర్శనలు ఆకట్టకుంటాయి. గ్రామంలో అతి పురాతనమైన చిన్న గుడిపై వేసిన లోహర్ని దేవి బొమ్మనే గ్రామస్థులు పూజిస్తారు. ఇక్కడ విగ్రహం ఉండదు ఇదే ఇక్కడ ప్రత్యేకత. గజపతి రాజులు ఈ ప్రాంతం రాక పూర్వం నుంచే ఉత్సవాలు జరుగుతున్నాయని చెబుతుంటారు.

## సింధనూరు అభివృద్ధికి రూ.12 కోట్లు మంజూరు

సింధనూరు : హెచ్.కె.ఆర్.డి.బి మ్యాక్రో పథకం, గ్రామవికాస యోజనల్లో సింధనూరు నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసిందని స్థానిక శాసనసభ్యుడు బాదర్లి హంపనగౌడ ఆదివారం పాత్రికేయులకు తెలిపారు. ఇందులో తాలూకాలోని దడేసుగూరు, ఉప్పళ గ్రామాలను గ్రామవికాసకు ఎంపిక చేసి ఆయా గ్రామాల్లో రూ.కోటి వంతున నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాగలపర్వి, ఆయనూరు, యాపలపర్వి, కె.బసాపూరు, కె.హంచినాళ్ తదితర గ్రామాలకు రూ.50 లక్షల చొప్పున అందించనున్నట్లు చెప్పారు. పట్టణంలోని ప్రభుత్వ క్రీడామైదానం అభివృద్ధికి రూ.2.5 కోట్లు, జూనియర్ కళాశాల ప్రహరి నిర్మాణానికి రూ.50 లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు.

సింధనూరుకు సంబంధించి ఆసక్తికర విషయాన్ని మరో రెండ్రోజుల్లో వెల్లడిస్తానని పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే బాదర్లి ప్రకటించి ప్రజల్లో ఆసక్తి రేకెత్తించారు. పార్టీ మారనున్నారా..? లేక సింధనూరుకు వైద్య కళాశాల మంజూరు చేయిస్తున్నారా అంటూ పాత్రికేయులు బాదర్లిను ఎదురు ప్రశ్నించగా.. వేచి చూడండి, నేను ప్రకటించే అంశం సింధనూరుకు మకుటం లాంటిది అంటూ అందరినీ సస్పెన్స్‌లో పెట్టారు.

## రాత్రి సమయంలో నది దాటొద్దు

### కలెక్టర్ సుందరవల్లి

పళ్ళిపట్టు : కుశస్థలి నది ఒడ్డున ఉన్న గ్రామస్తులు రాత్రి సమయంలో నదిని దాటవద్దని తిరువళ్ళూరు జిల్లా కలెక్టర్ సుందరవల్లి సూచించారు. పళ్ళిపట్టు షోలింగర్ రోడ్డులోని కుశస్థలి నదిపై ఉన్న వంతెన, పున్నియం గ్రామంలోని వంతెన, నెడియం, సామంతవాడా ప్రాంతాలలోని నేల వంతెనలను జిల్లా కెలక్టర్ సుందరవల్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ పళ్ళిపట్టు సమీపంలోని ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కృష్ణాపురం జలాశయం నుంచి రెండు రోజులుగా నీటిని వదులుతున్నారని పేర్కొన్నారు. దీంతో నెడియం, సామంతవాడా గ్రామాల సమీపంలోని నేల వంతెనపై ఒక అడుగు నీరు చేరుతోందని, ఈ సమయంలో అటుగా వెళ్లే వారు ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. కలెక్టరు వెంట తిరుత్తణి ఆర్డీవో జయరామన్, పళ్ళిపట్టు తహసీల్దారు తమిళ్‌సెల్వి, ఇంజినీర్లు విజయకుమార్, వేదపురి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## వినోదపు పన్నుతో చిత్ర పరిశ్రమకు నష్టం

చెన్నై : వినోదపు పన్ను కారణంగా తమిళ చిత్ర పరిశ్రమకు నష్టం వాటిల్లుతోందని, 40 శాతం పన్ను కట్టి ఎవరూ వృత్తిని కొనసాగించలేరని నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి విశాల్ పేర్కొన్నారు. దక్షిణ భారత నడిగర్ సంఘం 64వ సర్వసభ్య సమావేశం చెన్నైలో జరిగింది. దీనికి అన్నా అరివాలయంలోని కామ రాజర్ అరంగం వేదికైంది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నాజర్, ప్రధాన కార్యదర్శి విశాల్, కోశాధికారి కార్తి, ఇతర సభ్యులు, నాటక కళాకారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్తి మాట్లాడుతూ.. జనవరిలో తారల క్రికెట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి సూపర్‌స్టార్ రజనీకాంత్, కమల్‌హాసన్‌ల అంగీకారం కూడా తీసు కున్నామని పేర్కొన్నారు. జీఎస్టీ కారణంగా సంఘం భవనం ఖర్చులు కాస్త పెరిగాయని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం విశాల్ మాట్లాడుతూ.. తమ నిర్వాహక బృందం ఎలాంటి నిబంధనలనూ అతిక్రమించలేదన్నారు. కార్యకలాపాల్లో ఎలాంటి లోపాన్ని కూడా చూపెట్టలేరని స్పష్టం చేశారు. మంచిని మాత్రమే తాము చేస్తున్నామని పేర్కొన్నారు.

వచ్చే డిసెంబరు కల్లా నటీనటుల సంఘం భవనం పూర్తవుతుందని తెలిపారు. స్థానికులు కూడా వెళ్లి చూసేలా దీన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు.

వినోదపు పన్నును రద్దు చేయాలని నటుడు, ఎమ్మెల్యే కరుణాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని కోరారు. అలా జరిగితేనే పరిశ్రమ తేరుకుంటుందని పేర్కొన్నారు.

## జీఎస్టీ సవరణతో ఆర్థికాభివృద్ధి

భువనేశ్వర్ : చిన్నతరహా వ్యాపారులు, పరిశ్రమల వికాసానికి జీఎస్టీ విధానాలు సవరించారని, దీంతో దేశ ఆర్థిక వికాసం తథ్యమని భాజపా రాష్ట్ర కార్యదర్శి పృథ్వీరాజ్ హరిచందన్ అన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ జీఎస్టీ విధానాలు సరళీకరణకై జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సంతోషం వ్యక్తం చేశారు. ఎగుమతి చేస్తున్న వ్యాపారులకు జీఎస్టీ అండగా నిలుస్తుందన్నారు.

మొదటి పేజీ తరువాయి

## అవినీతి భరతం పడతాం

అలాంటి పరిస్థితి తలెత్తకుండా చూసుకొనే బాధ్యత తనదని ప్రకటించారు. కేవలం బొగ్గు గనులకు మాత్రమే సింగరేణిని పరిమితం చేయకుండా ఇతర ఖనిజాల తవ్వకాలను అప్పగించి విస్తరిస్తామన్నారు. భూగర్భ గనులను కాపాడుకొంటామని, త్వరలో మరో ఆరు గనులను ప్రారంభిస్తామని చెప్పారు. ఓపెన్ కాస్ట్ గనులు అవసరం అని, వాటి లాభనష్టాలు సమన్వయం చేసుకుంటూ ముందుకుపోతామని పేర్కొన్నారు. సింగరేణిలో కార్మికుల రక్తం తాగుతున్న ప్రస్తుత మెడికల్ బోర్డును ప్రక్షాళన చేస్తామని చెప్పారు. చరిత్రలో నిలిచిపోయేలా 11 డివిజన్లకు 9 డివిజన్లు గెలిపించిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణకు సింగరేణి కొంగుబంగారమని, దాన్ని కాపాడుకొంటూ కార్మికులకు ఫలాలు అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇతర వివరాలు సీఎం కేసీఆర్ మాటల్లోనే..

ఇప్పుడు చూపిస్తాం

2012లో టీబీజీకేఎస్‌ను గెలిపించారు. అనుకున్నంత మంచి పనులు జరగలేదు. రోగం ఏందో తెలిస్తెనే మందు వేసుకుంటం. ఇప్పుడు మందు వేయాలి. చిక్కులు బాగా ఉన్నాయి. పరిగికంప లాంటి పరిస్థితి నుంచి దాటుకుంటూ వస్తున్నాం. ప్రభుత్వం వచ్చాక మీ మీద శ్రద్ధ పెట్టలేదు. నిజం ఒప్పుకోవాలె. సమయం లేకుండే. పనులు జరుగుతున్నయి కదా అనుకున్నా. గతంలో టీబీజీకేఎస్ గెలిచింది మీ దయతోనే. ఇప్పుడూ గెలిపించారు. ఈ గెలుపు నిజమైంది కావాలె. కార్మికులు గెలిస్తేనే అది సాధ్యం. సింగరేణిలో ఉండే ప్రతి కార్మికుడి గెలుపు ఇది. కార్మికులు ఏసంఘంవారైనా నాకు సంబంధం లేదు. అందరి బాగు చూసుకుంటా. ఎప్పుడూ సంఘాలు గెలుస్తూ వస్తున్నాయి. ఈసారి కార్మికులను గెలిపిస్తాం. మీరు గెలువలేదు. గెలిపించారు.

ఇతర సంస్థలను కాపాడుకుంటాం

సింగరేణి లెక్కనే ఆర్టీసీలో 50వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నరు. నేను సీఎం అయ్యేనాటికి వారి ఉద్యోగాలు ఉంటయా ఉండయా కూడా ఎవరికీ స్పష్టత లేదు. వారి బతుకులు అగాధంలో ఉండేవి. ఆర్టీసీకి ప్రభుత్వం నుంచి రూ. 750కోట్లు బడ్జెట్ ఇచ్చి నిలబెట్టినం. నష్టాల్లో ఎక్కువ భాగం సిటీ నుంచే. విదేశాల్లో నగరాల నుంచి వచ్చే నష్టాన్ని నగర సంస్థలు భరిస్తాయి. అలాగే ఇక్కడా భరించేలా చేసినం. ఏడాదికి 200కోట్లు ఇచ్చేలా జీహెచ్ఎంసీని ఒప్పించినం. అలా ఆర్టీసీని కాపాడినం. మరో పెద్దసంస్థ ఎలక్ట్రిసిటీ. వాళ్లలో చాలామంది తక్కువ జీతాలకు పనిచేస్తున్నరు. కడుపు కూడా నిండది. 25వేల మందిని ఔట్‌సోర్సు ఉద్యోగులను పెట్టారు. వారికి జీతాలివ్వరు. ఎంతకాలం ఇలా అని చెప్పి వారి సమస్యకు పరిష్కారం చూపే ప్రయత్నం చేసినం.

సభ్యత్వ రుసుం రూపాయే

కార్మిక సంఘానికి సభ్యత్వ రుసుం రూ.20 చెల్లిస్తున్నారు. ఎందుకు ఇయ్యాల్నో నాకు అర్థం కాదు. ఎవనికి దొబ్బపెట్టడానికి ఇయ్యాలె. 53వేల మంది కార్మికులు నెలకు రూ.20 ఇస్తే నెలకు 13.50 లక్షలు అయితున్నయి. ఇదేమన్న లంచమా. సేవాభావం ఉంటే ఇంత ఎందుకు? ఇక నుంచి కార్మికసంఘ సభ్యత్వానికి మీరు ఇచ్చేది కేవలం ఒక రూపాయే. ఎవరికైనా అంతే. దీనిమీద త్వరలో అగ్రిమెంట్ కూడా చేపిద్దాం. ఇప్పుడు చూద్దాం ఎన్ని సంఘాలు సేవ చేసేందుకు వస్తాయో. చెప్పులు లేకుండా వచ్చినోడు కార్లల్ల తిరుగుతున్నడు. కార్మికుల రక్తం తాగి సేవపేరుతో గడించారు. మొత్తం బంద్ కావాలె.

## బ్లాక్ చైన్‌తో అద్భుతాలే..

తెలిపారు. బ్లాక్‌చె%న్ పరిజ్ఞానంతో సమీప భవిష్యత్తులో అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. అంతర్జాలం కనిపెట్టాక ప్రపంచమంతా కుగ్రామంగా మారిందన్నారు.

## గోద్రా రైలు దహనం కేసులో శిక్ష తగ్గింపు

ప్రయాణికులపై రాళ్ల దాడికి దిగారు. అనంతరం నాలుగు బోగీలకు నిప్పంటించారు. ఈ ప్రమాదంలో 59 మంది మృతిచెందారు. వీరిలో 27 మంది మహిళలు, 10 మంది చిన్నారులున్నారు. గోద్రా రైలు దహనం ఘటన నేపథ్యంలో రాష్ట్రంలో పెద్దఎత్తున అల్లర్లు చోటుచేసుకున్నాయి. రోజుల తరబడి జరిగిన ఈ హింసాత్మక ఘటనల్లో 1000 మందికి పైగా ప్రజలు చనిపోయారు.

గోద్రా రైలు దహనం కేసులో 2011 ఫిబ్రవరిలో గుజరాత్ ట్రయల్ కోర్టు తీర్పు వెల్లడించింది. రైలు దహనం ఘటన ప్రమాదం కాదని.. కుట్రపూరితంగా రైలుకు నిప్పంటించారని కోర్టు పేర్కొంది. ఈ కేసులో 31 మందిని దోషులుగా తేల్చుతూ వారికి శిక్షలు ఖరారు చేసింది. వీరిలో 11 మందికి ఉరిశిక్ష విధించగా.. మిగతా 20 మందికి జీవితఖైదు విధించింది. అయితే సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా మరో 63 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. వీరిలో సిట్ పేర్కొన్న ప్రధాన సూత్రధారి మౌల్వీ సయీద్ ఉమార్జీ కూడా ఉన్నాడు.

కాగా.. ట్రయల్ కోర్టు తీర్పుపై ఉరిశిక్ష పడిన 11 మంది దోషులు గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. మరోవె%పు 63 మందిని నిర్దోషులుగా విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ ప్రభుత్వం కూడా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ రెండు పిటిషన్లపై విచారించిన న్యాయస్థానం సోమవారం తీర్పు వెలువరించింది. 11 మంది దోషుల అప్పీళ్లను అంగీకరిస్తూ వారి మరణశిక్షను జీవితఖైదుకు తగ్గించింది. నిర్దోషుల విషయంలో 2011 నాటి తీర్పును మార్చబోమని కోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ కేసులో ప్రధాన సూత్రధారి సయీద్ ఉమార్జీ మరోసారి నిర్దోషిగా తేలడం గమనార్హం.

## జమ్ముకశ్మీర్‌లో మరో కీలక ఉగ్రవాది హతం

బారాముల్లాలోని లాదోరా ప్రాంతంలో ఉగ్రవాదులు దాగి ఉన్నారని నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో భద్రతాసిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో భద్రతాబలగాలపైకి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు.

దీంతో ఎదురుకాల్పులు జరిపిన భద్రతాసిబ్బంది ఓ ఉగ్రవాదిని మట్టుబెట్టారు. మృతుడిని జైషే మహ్మద్‌కు చెందిన అబు ఖలీద్‌గా గుర్తించారు. పాకిస్థాన్‌కు చెందిన ఖలీద్.. మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది. ఉత్తర కశ్మీర్‌లో జరిగిన అనేక ఉగ్రదాడుల వెనుక ఇతడి హస్తం ఉంది. కాగా.. ఈ ఎన్‌కౌంటర్‌కు కొద్ది గంటల ముందే బుద్గాం జిల్లాలోని డ్రాంగ్ గ్రామంపై ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన ఓ సైనికుడు ప్రాణాలు కోల్పోయాడు.

## సమసిన శతవార్షిక వివాదం

బ్రహ్మపుర : స్థానిక ది బరంపూర్ కోఆపరేటివ్ సెంట్రల్ (బీసీసీ) బ్యాంకు లిమిటెడ్ 2016లోనే వందేళ్లు పూర్తి చేసుకుందని న్యాయ స్థానం స్పష్టం చేసిందని ఆ బ్యాంకు అధ్యక్షుడు అలేఖ్ చౌధురి చెప్పారు. బ్యాంకు సమావేశ మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో చౌధురి మాట్లాడుతూ 1916 అక్టోబరు 8న ది గంజాం డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ బ్యాంకింగ్ యూనియన్‌గా రిజిష్టరు అయి బ్యాంకుకు శ్రీకారం జరిగిందన్నారు. స్వతంత్ర ఒడిశా ఏర్పాటు అనంతరం 1936 డిసెంబరు 31న ఇది ది బ్రహ్మపుర కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు లిమిటెడ్‌గా రిజిష్టరు అయిందన్నారు. 2016లోనే ఇది వందేళ్లు పూర్తి చేసుకుందని ఆయన తెలిపారు. బ్యాంకు నిర్వహణ కమిటీ గతంలో బ్యాంకు శత వార్షికోత్సవాలు జరిపేందుకు సన్నాహాలు కూడా చేపట్టామని అన్నారు.

## 14న ఉత్కళుల సాహితీసభ

ఖరగ్‌పూర్ : పట్టణ కొత్తకోళీ జగన్నాథ మందిరంలో శ్రీ జగన్నాథ శిశు వికాస్ కేంద్రం ఆధ్వర్యంలో ఫకీర్ మోహన్ సేనాపతి శత జయంతి ఉత్సవాలలో భాగంగా సాహితీసభ అక్టోబరు 14వ తేదీ ఉదయం నిర్వహించనున్నట్లు కార్యక్రమం సమన్వయకర్త డి.పి.పట్నాయక్ తెలిపారు. ఈ మేరకు జరిగిన కార్యక్రమంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇందులో అతిథులుగా పాల్గొనేందుకు ఒడిశా రాష్ట్రం నుంచి పలువురు ప్రముఖులు రానున్నట్లు తెలిపారు. వారిలో ఒడిశా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి ఎమ్.అనంతదాస్, బాలసోర్ జిల్లా జడ్జి ప్రమోద్‌కుమార్ దాస్, ఒడిశా రాష్ట్ర సాంస్కృతిక శాఖామాత్యులు మనోరంజన్ పాణిగ్రహి, ఫకీర్ మోహన్ విశ్వవిద్యాలయం ఉపకులపతి మధుమిత దాస్‌లు ఉన్నారని పేర్కొన్నారు. స్థానిక ప్రముఖులు కూడా ఈ సాహితీసభ, చర్చాగోష్ఠిలో పాల్గొనున్నారు.

## దీపావళి కొనుగోళ్ల సందడి

కోయంబత్తూరు : దీపావళి సమీపిస్తుండటంతో నగరంలోని ప్రధాన వాణిజ్య కూడలిలో ఒకటైన ఒప్పనకార వీధిలో కొనుగోళ్లు పెరిగాయి. జనం రద్దీ మరింత ఎక్కువగా కనిపిస్తోంది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడ్డుకోవడానికి పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. వాహనాల్లోనూ పలు ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడకు వచ్చి షాపింగ్ చేసుకుని వెళ్తున్నారు. జేబు దొంగతనాలు, గొలుసు దోపిడీల జరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఒప్పనకారవీధిలో నిఘా గోపురాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. అనుమానితులను గమనిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాలను క్రమబద్ధీకరిస్తున్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో జాతీయ రహదారిపై ఆదివాసీ తుడుందెబ్బ సంఘాల నాయకులు బోథ్ మాజీ ఎమ్మెల్యే సోయం బాపురావ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ మాట్లాడుతూ బంజార నాయకులు సోయం బాపురావు దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భీం ఉద్యమానికి బంజారులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. సోయంతో పాటు మరికొందరిపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసులపై దాడికి పాల్పడుతున్న లంబాడిలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరారు. నకిలీ ఎస్టీ ధ్రువీకరణ పత్రాలను పొందిన లంబాడ నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. తొలుత వారు ఇచ్చోడలో జాతీయరహదారిపై నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా నాయకుడు కొడప జలైజాకు, చాహకటి కృష్ణమూర్తి, సిడాం మురళీ, జంగు, కేశవ్, విఠల్, జుగ్నక్ శ్రీకాంత్, చాహకటి అభిమాన్, రమాకాంత్, సిడాం సాయి, నాగోరావ్, రవి, జగదీష్, వెంకటి, బాలాజీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో రాజీనామా చేసి గెలవాలి

### కేసీఆర్‌కు జిల్లా ఐకాస సవాల్



సంగారెడ్డి : తెలంగాణ ఐకాస రాష్ట్ర ఛైర్మన్ ఆచార్య కోదండరాంను చులకన చేసి మాట్లాడ డం తగదని, గజ్వేల్‌లో రాజీనామా చేసి గెలవా లని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలంగాణ ఐకాస సూచించింది. మా తరఫున కోదండరాంను అభ్యర్థిగా నిలబెడుతామని పేర్కొన్నారు. స్థానిక అతిథి గృహంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తెలంగాణ ఐకాస జిల్లా ఛైర్మన్ వై.అశోక్‌కుమార్, కన్వీనర్ జి.బీరయ్య యాదవ్ మాట్లాడారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ మాటలు ఆయన అసహనానికి నిదర్శనమన్నారు. సింగరేణి సంస్థలో విజయం సాధిస్తే సంబరాలు చేసుకోవాలని, ఉద్యమకారులను విమర్శించడం తగదని చెప్పారు. తెలంగాణ ప్రజల్లో ప్రశ్నించే తత్వం మొదటి నుంచి ఉందన్నారు. ముఖ్య మంత్రి కేసీఆర్ ఐకాసను ఏర్పాటు చేయలేదని, అంతకంటే ముందే ఉద్యోగ, ఉపాధ్యాయ ఐకాసలు ఏర్పాటు చేసుకున్నారని గుర్తు చేశారు. నియంతృత్వ పాలన చేస్తే ప్రజలే ఇంటికి పంపుతారని హెచ్చరించారు. తెలంగాణ ఐకాస రాష్ట్ర ఛైర్మన్ ఆచార్య కోదండరాం సోమవారం జిల్లాలో పర్యటిస్తారని ఐకాస నాయకులు ప్రకటించారు. ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు న్యాల్‌కల్ మండలం గంగ్వార్‌లో నిమ్జ్ బాధితులు ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆత్మహత్య చేసుకున్న బీఈడీ అభ్యర్థి రామకృష్ణ కుటుంబ సభ్యులను నారాయణఖేడ్‌లో పరామర్శిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనకు, కోదండరాం పర్యట నకు ఎలాంటి సంబంధం లేదన్నారు. సమావేశం లో జిల్లా కో-కన్వీనర్ సాయిలు, కో-ఆర్డినేటర్ శేఖర్, డివిజన్ కన్వీనర్ తుల్జారెడ్డి, పట్టణ ఛైర్మన్ వెంకటేశ్వర్లు, నాయకులు రాహుల్, నాసర్ పటేల్, నరేష్, భాను, తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేసేవరకు పోరాటం

సిద్దిపేట అర్బన్: తెరాస ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పసుల రాంమూర్తి డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో భాజపా, రాష్ట్రంలో తెరాస ప్రభుత్వాలు ఏర్పడిన నాటి నుంచి దళితులపై దాడులు అధికమయ్యాయని అన్నారు. తెలంగాణలో మాలలకు రాజకీయ ప్రాతినిథ్యం తగ్గిస్తున్న రాజకీయ పార్టీలను వెలి వేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉప ప్రణాళిక నిధులను దారి మళ్లించి దళితుల పొట్ట కొడుతోందని ఆరోపించారు. దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పాండు, కార్యదర్శిగా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా నర్సింహులును నియమించి పత్రాలు అందజేశారు. సమావేశంలో నాయకులు మహేందర్, ఎల్లం, కుమార్, రవి తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు షురూ

సిద్దిపేట : సిద్దిపేటలో ఈనెల 11న ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు షురూ చేశారు. కొండపాక మండలం దుద్దెడ శివారులోని నాగులబండ వద్ద కలెక్టరేట్, పోలీస్ కమిషనరేట్, సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి పరిధిలో ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. పట్టణంలోని వైకుంఠధామం ఎదురుగా బాహ్యవలయ రహదారిని ఆనుకొని ఉన్న స్థలంలో సభ నిర్వహించనున్నారు. ఆయా స్థలాల్లో భూమిపూజ, శంకుస్థాపనకు గుంతలు తీసే ప్రక్రియ మొదలైంది. ఈ ఏర్పాట్లను గడా ఓఎస్డీ హనుమంతరావు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. నాగులబండ, సిద్దిపేటలోని సభాస్థలి వద్ద హెలీప్యాడ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

## హక్కుల సాధనకు నిరంతర పోరాటం

### నార్సింగిలో రెడ్డి పోరుయాత్రకు ఘనస్వాగతం




చేగుంట : రెడ్డి కులాలకు రావల్సిన హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేయాల్సిన తరుణం ఆసన్నమైందని రాష్ట్ర రెడ్డి ఐక్యవేదిక అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి అన్నారు. రెడ్డిపోరు పాదయాత్ర నార్సింగి మండలంలో ప్రవేశించింది. ఈనెల 2న వేములవాడలో ప్రారంభమైన ఈ పాదయాత్ర నార్సింగికి రాగానే రెడ్డికులస్థులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నార్సింగిలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల నాటికి రెడ్డికులస్థులు అందరు ఐక్యంగా ఉండి మన సత్తా ఏమిటో నిరూపించాలని అన్నారు. రెడ్లలో 85 శాతం మంది నిరుపేదలుగా ఉన్నారని వారికి తీవ్రంగా అన్యాయం చేస్తున్నారని చెప్పారు. చట్టబద్ధతతో రూ.వెయ్యి కోట్ల ప్రత్యేక నిధులతో రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీ నుంచి పీజీ వరకు ప్రతి జిల్లా కేంద్రంలో ఒకటి చొప్పున గురుకులాన్ని రెడ్డి విద్యార్థుల కోసం ఏర్పాటు చేయాలని కోరారు. ఉన్నత విద్య కోసం విదేశీ విద్యానిధి, 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు నెలకు రూ.3 వేల పింఛను, రెడ్ల స్థితిగతులను అధ్యయనం చేయటానికి ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. విద్యా, ఉద్యోగాలలో వయో పరిమితి సడలించి 10 శాతం ప్రత్యేక రిజర్వే షన్‌ను కల్పించాలని తెలిపారు. పాదయాత్ర ఈనెల 12న కొంపల్లికి చేరుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఐక్యవేదిక కన్వీనర్ రాంరెడ్డి, ఉత్తర తెలంగాణ కన్వీనర్ రాఘవరెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షుడు అమరసేనారెడ్డి, ఎంపీపీలు అల్లిరమ, జయ, నార్సింగి పట్టణ రెడ్డిసంఘం అధ్యక్షుడు ఎన్నం నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, చేగుంట మండల కన్వీనర్ శ్రీరాంరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ నారాయణరెడ్డి, రైసస మండల కన్వీనర్ లింగారెడ్డి, పట్టణ కన్వీనర్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అసంఘటిత రంగ కార్మికులను ఆదుకోవాలి: టాక్స్

ఖానాపురం : నూతన అర్థిక విధానాలు అమలు చేయటం వల్ల వ్యవసాయం సంక్షోభంలో పడిపోయి అసంఘటిత రంగం కార్మికుల సంఖ్య పెరిగిందని, వారిని ప్రభుత్వాలు ఆదుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఖమ్మం లోని కెమిస్ట్ ఎండ్ డ్రగ్గిస్టు భవనంలో అసంఘ టిత కార్మిక సంఘాల సమాఖ్య(టాక్స్) రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సదుస్సులో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2014 స్వదేశీ నినాదం అధికారంలోకి వచ్చి ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడిదారులకు కట్టబెట్టారన్నారు. 44 కార్మిక చట్టాలను సవరణ చేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టా లను రూపొందించటంతో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పారుగు సేవల కార్మికులను క్రమబద్ధీ కరించాలని డిమాండ్ చేశారు. సదస్సులో బంటు శ్రీనివాస్, టాక్స్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు ఖాసీం, తిరుపతి, ఇఫ్టూ బాధ్యులు శ్రీధర్, అశోక్, అమరవేణి నర్సగౌడ్, ఉదయ్, నాగరాజు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## శివసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్‌గా ఠాకూర్ కరణ్‌సింగ్

ఆదిలాబాద్ : శివసేన పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ కన్వీనర్(ప్రముఖ్)గా ఠాకూర్ కరణ్‌సింగ్ ఎంపికయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు యతీంద్రనాథ్ యాదవ్ ఆయనను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణం, ఆదిలాబాద్ గ్రామీణం, మావల, జైనథ్, బేల, మండలాల్లో విస్తృతంగా పర్యటించి పార్టీ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల వరకు పార్టీ ఒక శక్తిగా ఎదగాలని, అందుకు కష్టపడి పని చేయాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ కన్వీనర్ ఎంపిక పట్ల పార్టీ సీనియర్ నాయకులు ప్రభు బోయర్, నాకోడ్ ప్రమోద్‌ఖత్రి, చాణక్య యాదవ్, ఠాకూర్ సంతోష్‌సింగ్, కోట సాయికృష్ణ, పోలోజు కృష్ణకుమార్, సాయిరాఠోడ్, జిల్లా అధికార ప్రతినిధి అర్జునే గిరిష్ పాటిల్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## రాష్ట్ర క్రికెట పోటీలకు చిమ్మపూడి విద్యార్థులు

చిమ్మపూడి : రాష్ట్రస్థాయిలో జరిగే అండర్-17 క్రికెట్ పోటీలకు తమ విద్యార్థులు ముగ్గురు ఎంపిక అయ్యారని రఘునాథపాలెం మండలం చిమ్మపూడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.వెంకటేశ్వర్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులు కె.గోపి, పి.పవన్‌కళ్యాణ్, పి.కరుణాకర్‌లు ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టుకు ఆడనున్నారని ఆయన చెప్పారు. కొత్తగూడెంలో ఈనెల 6వ తేదీన జరిగిన పోటీలలో ప్రతిభ కనబరిచిన వీరిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారని హెచ్‌ఎం తెలిపారు. సంగారెడ్డిలో 10వ తేదీ నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను సర్పంచి రాగ యల్లమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు దశరథ గంగమ్మ, ఎస్‌ఎంసీ ఛైర్మన్ నాగేశ్వరరావు, హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఉమ్మడి జిల్లాల్లో బీఎస్ఎన్ఎల్ మహామేళాలు

ఆదిలాబాద్ : భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ వినియోగదారుల సౌకర్యార్థం 13వ తేదీ వరకు ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం, మంచిర్యాల జిల్లాల్లోని 21 ప్రాంతాల్లో మహామేళాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఎస్.నాగిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జీఎంటీడీ బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. బంధువులు, మిత్రుల పేరిట ఉన్న సిమ్‌లు తమ పేరుపై చేసుకోవాలని, అందుకు సమీప వినియోగదారుల మీ సేవా కేంద్రంలో ఆధార్ పత్రం ఇస్తే వారు వేలిముద్ర లు సేకరించి ఉచితంగా అనుసంధానం చేస్తారని తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి లోపు అనుసం ధానం చేయకపోతే సిమ్‌లు డిస్‌కనెక్షన్ అవుతా యని పేర్కొన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం ఆధార్ అనుసంధానం మేళాల్లో చేసుకునే వెసులుబాటును కల్పించామన్నారు. మేళాలో వివిధ పథకాలు, ఆకర్షణీయమైన ఓచర్లు తెలుసుకోవచ్చున్నారు. సమావేశంలో ఎస్‌డీఈ చంద్రశేఖర్, జేటీఓ భాస్కర్ పాల్గొన్నారు.

## సామాజిక తెలంగాణ కోసమే టీ-మాస్

### సత్తుపల్లిలో టీ-మాస్ సదస్సు

సత్తుపల్లి : సామాజిక తెలంగాణ ధ్యేయంగా ప్రజా సంఘాల ఐక్యవేధిక (టీ- మాస్ ) ఏర్పడిందని ఆ సంఘ జిల్లా ఛైర్మన్, రచయిత్రి జ్వలిత అన్నారు. సత్తుపల్లిలో టీ-మాస్ సదస్సు భారీగా సాగింది. టీ-మాస్ మండల కన్వీనర్ కొలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. సభలో జ్వలిత మాట్లాడుతూ తెలంగాణ ప్రజా గొంతుకగా టీ-మాస్ పనిచేస్తుందన్నారు. సామాజి క తెలంగాణ కోసం విద్యార్థులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు కలసి రావాలని కోరారు. ఇటీవల రాష్ట్రంలో 280 సంఘాలతో టీ-మాస్ ఏర్పడిందన్నారు. ఇందులో భాగంగా అన్ని ప్రజా, కుల సంఘాలతో జిల్లా, మండల కమిటీల ఏర్పాటు జరుగుతోందని వివరించారు. టీ-మాస్ ఫోరమ్ జిల్లా కన్వీనర్ ఎర్రా శ్రీకాంత్ మాట్లాడు తూ.. ప్రజా సంఘాలన్నీ ఒక తాటిపైకి వచ్చినప్పు డు రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సైతం రైతుల ఆత్మహత్యలు పెరగటం శోచనీయమన్నారు. సంఘ మండల కన్వీనర్ శరత్‌బాబు, పుల్లయ్య, ఉప్పు గురవయ్యలు పాల్గొన్నారు. ఎంఆర్‌పీఎస్, లంబాడీ హక్కుల పోరాట సంఘం, యాదవ, నాయకపోడు, మందుల, కుమ్మర, వడ్డెర, రజక, నాయిబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, శాలివాహన, విశ్రాంత ఉద్యోగులు, టీఎంఆర్‌పీఎస్, బీసీ సబ్‌ప్లాన్ సంఘాల బాధ్యులు దేవదాసు, దశరథ నాయక్, రాంబాబు, మారేశ్వరరావు, బాపయ్య, చెన్నారావులు పాల్గొన్నారు. రైతు సంఘం నాయకులు రాజబాబు, పాండు, జాజిరి శ్రీనివాస్, కాశిబాబు తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరే వరకు టీ-మాస్ పోరాడుతుందన్నారు.

## సమాచార లోపంతో నిలిచిన శంకుస్థాపన


ఖమ్మం : స్థానిక ఎమ్మెల్యే అజయ్ కుమార్, మేయర్ డా.పాపాలాల్‌లకు అధికారులు సరైన సమాచారం ఇవ్వకపోవటం తో నగరంలోని 48వ డివిజన్ దానవాయగూడెంలో సీసీ రోడ్ల శంకుస్థాపన నిల్చిపోయింది. సోమవారం సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అజయ్ కుమార్ శంకుస్థాపన చేస్తారని గుత్తేదారులు ప్రకటించారు. స్థానిక కార్పొరేటర్ రామారావు రెండు గంటల సేపు వేచి ఉన్నప్పటికీ ఎమ్మెల్యే, మేయర్లు హాజరు కాలేదు. వారిని సంప్రదించగా తమకు ఎటు వంటి సమాచారం లేదని చెప్పడంతో శంకుస్థాపనను వాయిదా వెయ్యాల్సి వచ్చింది.

## మూసీ ప్రాజెక్టు నాలుగు గేట్ల ఎత్తివేత 5 వేల క్యూసెక్కుల నీటి విడుదల

కేతేపల్లి : మూసీ ఎగువ ప్రాంతాలైన రంగారెడ్డి, వికారాబాద్, వరంగల్ జిల్లాలతో పాటు, రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు మూసీ జలాశయానికి వరదనీటి రాక ప్రారంభమైంది. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 645అడుగుల స్థాయికి మించకుండా ఉండేందుకు అధికారులు ఆదివారం నాలుగు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. హైదరాబాద్ నగరం నుంచి వరద ఉద్ధృతి పెరుగుతుండటంతో నీటి పారుదల శాఖాధికారులు డ్యామ్‌వద్ద ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఒక్కో క్రస్టు గేటును అడుగున్నర ఎత్తుమేర లేపి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ ఎగువ ప్రాంతాల నుంచి 2 వేల క్యూసెక్కుల వరదనీరు వస్తుంది. ప్రాజెక్టు నీటిమట్టం 644.5 అడుగుల వద్ద నిలకడగా ఉండే విధంగా అధికారులు నీటి చేరిక, విడుదలను గమనిస్తున్నారు. ప్రాజెక్టు ప్రధాన కుడి కాలువకు 50 క్యూసెక్కులు, ఎడమ కాలువలకు 100 క్యూసెక్కుల చొప్పున మొత్తం 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ రిజర్వాయర్‌కు సోమవారం వరద నీటి రాక మరింత పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్టు డీఈఈ నవికాంత్ తెలిపారు.

## మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు


### శ్రీ మెదక్ జిల్లా భక్తుల పర్తియాత్ర



పుట్టపర్తి : సత్యసాయి సేవా కార్యక్రమాలను మెదక్ జిల్లా వ్యాప్తంగా మరింత విస్రతం చేస్తామని జిల్లా సత్యసాయి సేవాసంస్థల అధ్యక్షుడు ప్రభాకర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా సాయిసేవాసంస్థల ఆధ్వర్యంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి, మహాసమాధి దర్శనార్థం అవిభక్త మెదక్ జిల్లా నుంచి వేలాది మంది భక్తులు పుట్టపర్తి విచ్చేశారు. సాయికుల్వంత్ మందిరంలో దివ్యలీలా వినోదం నాటికను బాలవికాస్ విద్యార్థులు నృత్యరూపకంలో ప్రదర్శించారు. సత్య సాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో బాలవికాస్ విద్యార్థులకు మానవతా విలువలతో కూడిన విద్య బోధన, నిరుపేద విద్యార్థులకు కంప్యూటర్లు, నోటు పుస్తకాలు అందజేశామన్నారు. దివ్యాంగులకు త్రిచక్రసైకిళ్ల పంపిణీతో పాటు, ఉచితంగా ప్రతి రోజు భోజనం కల్పిస్తున్నామన్నారు. జైల్లో ఖైదీలకు ఆధ్యాత్మిక సందేశం, మానవత విలువలు బోధిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతి, యువకులకు ఉచితంగా కంప్యూటర్, కుట్టుమిషన్, వ్యక్తిగత నైపుణ్య శిక్షణ అందించి, నిరుపేదలకు ఉచితంగా పరికరాలు అందించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శుద్ధ జలకేంద్రాలు ఏర్పాటు చేశామని, వైద్యశిబిరాలు ద్వారా వైద్యసేవలందిస్తున్నామన్నారు. నిరుపేదలకు నేత్ర శస్త్రచికిత్సలు చేయిస్తున్నామన్నారు. నిరుపేద రైతులకు నాణ్యమైన కూరగాయ విత్తనాలు ఉచితంగా అందించామన్నారు. భగవంతుడు తన దివ్యత్వాన్ని ప్రపంచానికి చాటేందుకు లీలలను ప్రదర్శిస్తుంటారని తెలియజేసే సందేశాన్ని నృత్యరూపకంలో బాలవికాస్ విద్యార్థులు తెలియజెప్పారు. తోటి మానవుడు ఆపదలో ఉన్నప్పుడు అందించే సేవల్లో దైవత్వం సిద్ధిస్తుందన్నారు. భక్తులకు ట్రస్టు సభ్యులు ఆర్.జెరత్నాకర్ వస్త్రాలను ప్రదానం చేశారు. సత్యసాయి భక్తులు సత్యసాయి భక్తిగీతాలను ఆలపించారు. వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. సోమవారం సాయికుల్వంత్ మందిరంలో మెదక్ భక్తులు సంగీతవిభావరి నిర్వహించనున్నారు.

## ముందుకు సాగని మరుగుదొడ్ల నిర్మాణాలు

### ఓడీఎఫ్ లక్ష్యానికి ఇంకా దూరం



ఖమ్మం : తిరుమలాయపాలెం మండలం సుబ్లేడ్‌లో ధరవాత్ పూర్ణ, తల్లాడ మండలం అన్నారు. గూడెంలో మరియమ్మ సహా ఇంకా ఎందరో నిరుపేద కుటుంబాల వారు తాము పూరి గుడిసెల్లో నివసిస్తున్నా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ముందుకొస్తున్నారు. గ్రామాల్లో పరిస్థితులు మారిపోతున్నాయి. గతంలో వలె బహిరంగ మల, మూత్ర విసర్జనకు ఎవరూ ఇష్ట పడటంలేదు. మహిళలు ఆత్మగౌరవం కోరుకుంటున్నారు. కచ్చితంగా మరుగుదొడ్డి నిర్మించుకోవాలని భావిస్తున్నారు.

గ్రామీణ ప్రజలు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ముందుకొస్తున్నా అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ గ్రామీణ్ పేరుతో ఒక్కో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12వేలు ఇస్తోంది. మొదట్లో ఈ కార్యక్రమం అమలు బాధ్యతను డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాలకు అప్పగించినా మండల స్థాయిలో ఎంపీడీవోలు పర్యవేక్షించేవారు. తాజాగా ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాన్ని తప్పించి పూర్తిగా అమలు బాధ్యతలను డీఆర్డీఏలోని ఉపాధి హామీ పథకం అమలు విభాగం వారికి అప్పగించారు. దీంతో అనేక గ్రామాల్లో పరిస్థితి మొదటికొచ్చింది. గతంలో ఈ విభాగం ఆధ్వర్యంలో మంజూరైన మరుగుదొడ్లు, లబ్ధిదారుల వివరాలను ఉపాధి హామీ పథకం అమలు విభాగం అధికారులు తమ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం కొన్ని నెలలుగా సాగుతోంది. ఈలోగా మరుగుదొడ్డి నిర్మాణాన్ని చాలామంది లబ్ధిదారులు మధ్యలోనే నిలిపేశారు. వారిని మళ్లీ ప్రోత్సహించి పనులు ప్రారంభింపజేయడం అధికారులకు ఇబ్బందులు కలిగిస్తోంది.

ఇటీవల కలెక్టర్ లోకేశ్‌కుమార్ అక్టోబర్ 2 నాటికి ఓడీఎఫ్ జిల్లాగా ప్రకటించాలి, మరుగుదొడ్లు నిర్మాణం పూర్తి చేయాలని చెప్పారు. కానీ నేటి వరకు బదలాయించిన లబ్ధిదారుల జాబితా ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియే కొనసాగుతోంది.

# విజయభాను

## సంపాదకీయం

### తుపాకీ సంస్కృతి వీడాలి

అమెరికాలోని ఆయుధ వ్యాపారంపై అధ్యయనం చేయటం కోసం ఓ సామాజికవేత్త వెళ్లినప్పుడు అక్కడి ఆయుధ తయారీ కంపెనీలు చెప్పిన మాటలు గమనించదగినవి. మేం తయారు చేస్తున్న తుపాకులు అమ్ముడు పోవాలంటే ప్రపంచంలో ఎక్కడో ఒక చోట యుద్ధాన్నిప్రేరేపిస్తాం, ఆయుధాలు అమ్ముకుంటాం అని వారు నిస్సిగ్గుగా చెప్పుకున్నారు. ఈ ఆయుధ వ్యాపారం వల్ల ప్రపంచ దేశాలు ఎలా యుద్ధభూములుగా, శ్మశానాలుగా మారాయో చరిత్ర చెబుతూనే ఉన్నది. అమెరికాలోని లాస్ వెగాస్‌లో జరిగిన నరమేధంతో ఆ దేశమే కాదు, ప్రపంచమంతా ఉలిక్కిపడింది. కొన్నేళ్లుగా ఉగ్ర దాడులతో ప్రపంచమంతా వణికిపోతున్న తరుణంలో లాస్‌వెగాస్ మారణహోమం దాన్ని మరింత రెట్టింపు చేసింది. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద దాడిగా పేర్కొంటున్న ఈ ఘటనలో 58మంది తుపాకీ గుండ్లకు బలయ్యారు. 515మంది క్షతగాత్రులయ్యారు. అందులో కొందరు తీవ్ర గాయాలతో మృత్యువుతో పోరాడుతున్నారు. ఇలాంటి దాడులు అమెరికాకు కొత్తకాదు. గతంలోనూ ఇదే తీరు దాడులు జరిగాయి. ఓర్లాండో, కనెక్టికట్, అరోరా, కొలరాడో, అలబామా, వర్జీనియా, కిలీన్ తదితర ఘటనల్లో అనేకమంది మరణించారు. ప్రధానంగా పర్యాటక స్థలాలు, ప్రార్థనా మందిరాలు, స్కూళ్లు, నైట్ క్లబ్బులు లక్ష్యం గా గతంలోనూ దాడులు జరిగాయి. అయితే ఇంత పెద్ద సంఖ్యలో చనిపోవటం అమెరికాలో ఇదే మొదటిసారి. రెండేళ్ల క్రితం ప్యారిస్‌లో సంగీత కచేరీపై జరిగిన దాడిలో 129 మంది చనిపోగా, 350మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇలాంటి దాడి జరిగినప్పుడల్లా నేరస్థుడికి ఉగ్రవాద మూలాలున్నాయా అనే సందేహం వెలిబుచ్చడం, ఉగ్రవాద మూకలకు ఈ భూతలంపై చోటు లేకుండా చేస్తామని ప్రకటించటం పాలక ప్రభుత్వాలకు అలవాటుగా మారింది. దాడికి పాల్పడింది ఉన్మాది మాత్రమేనని, ఉగ్రవాద మూలాలు లేవని తేలితే అదొక కాకతాళీయ ఘటనగా చూపి చేతులు దులుపుకోవటం పాలకులకు పరిపాటి అయ్యింది. ఇలాంటి దాడుల కు మూలాలెక్కడున్నాయో తెలుసుకుని, ఇలాంటి నరమేధాలకు తావులేని సురక్షిత సమాజా న్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నది ప్రభుత్వాల పరమావధిగా మారాలి. కానీ ఇది అగ్రరాజ్యం అమెరికాలో ఇసుమంతైనా లేకపోవటమే ఈ తాజా విషాదానికి మూలకారణంగా చెప్పక తప్పదు. ప్రపంచానికి అతిపెద్ద సవాలుగా మారిన ఐఎస్, జీహాదీల మారణహోమాలు అటుంచితే, అమెరికాను పట్టిపీడిస్తున్నది మాత్రం తుపాకీ సంస్కృతి. ప్రపంచంలో మరెక్కడాలేని విధంగా తుపాకుల తయారీ ఓ పరిశ్రమగా, లాభాలు తెచ్చిపెట్టే సులువైన వ్యాపారంగా అమెరికాలోనే ఉన్న ది. అమెరికా జనాభా సుమారు ముప్ఫై రెండున్నర కోట్లు అయితే అక్కడ ప్రజల వద్ద ఉన్న తుపాకుల సంఖ్య 31 కోట్లు. అమెరికాలో ఏటా పదిలక్షల తుపాకులు తయారవుతున్నట్లు అక్కడి వ్యాపార వర్గాలే చెబుతున్నాయి. ప్రతి వందమందిలో 89 మంది దగ్గర తుపాకులున్నాయి. ప్రపంచంలో మరే దేశంలో లేని విధంగా అమెరికాలో తుపాకు లు అందరికీ అందుబాటులో ఉండటమే ఈ గన్ కల్చర్‌కు మూలకారణం. అమెరికాలో 1965 నుం చి వివిధ యుద్ధాల్లో మరణించిన వారి సంఖ్య కం టే తుపాకుల సంస్కృతికి బలయిన వారి సంఖ్యే అధికమని గణాంకాలు చెబుతున్నాయి. చారిత్రకం గా చూస్తే, అమెరికా అంటేనే వలస దేశం. స్థానిక రెడ్ ఇండియన్లను నిర్వాసితులను చేస్తూ పాదుకొన్న అమెరికాలో వలసవాదులు తమ స్వీయ రక్షణకోసం తుపాకులను కలిగి ఉండటం ఒక సామాజిక అవసరంగా భావించారు. తుపాకులను వ్యక్తిగతంగా కలిగి ఉండే విధంగా చట్టాలు రూపొందించుకున్నారు. సామాజికంగా చూస్తే, ఈ తుపాకులు అన్నివర్గాల దగ్గర ఉన్నట్టు కనిపిస్తున్నా, ఒక వర్గం వారి దగ్గరే ఎక్కువగా ఉన్నాయి. సామాజిక ఉద్రిక్తతలకు తోడు ఆయుధ వ్యాపారుల విచ్చలవిడితనం కూడా అమెరికా సమాజానికి పెనుముప్పుగా మారింది. ఆయుధాల తయారీదారులు ప్రతి సంవత్సరం 88వేల కోట్ల ఆదాయం ఆర్జిస్తున్నారంటే అక్కడ ఆయుధ వ్యాపారం ఎంతగా సాగుతున్నదో తెలుస్తున్నది. లాస్ వెగాస్‌లో సంగీత కచేరీపై జరిగిన దాడి జరిగిన తీరు గమనించదగినది. హంతకుడు సమీపంలోని ఓ హోటల్‌లో 320 అడుగుల ఎత్తులోని 32వ అంతస్తునుంచి కాల్పులకు తెగబడ్డాడు. 365మీటర్ల దూరంలోని సందర్శకులపై గుళ్లవర్షం కురిపించాడు. అంటే అతడు వాడింది సాధారణ తుపాకీ కాదు. ఆటోమెటిక్ మిషిన్‌గన్ అయితేనే అంత దూరంలోని జన సమూహం మీద గుండ్ల వర్షం కురిపించగలడు. సాధారణ వ్యక్తి చేతుల్లోకి ఆటోమెటిక్ ఆయుధాలు అలవోకగా చేరుతున్నాయంటేనే అక్కడి ఆయుధ విధానంలోని డొల్లతనాన్ని అర్థం చేసు కోవచ్చు.

## చెల్లెలికి కీలక పదవి కల్పించిన కిమ్



టోక్యో: తండ్రి నుంచి వారసత్వంగా ఉత్తరకొరియా అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు కిమ్ జోంగ్ ఉన్. దశాబ్దాలుగా కిమ్ కుటుంబీకులే దేశంపై అధికారం చలాయిస్తున్నారు. అయితే భవిష్యత్తులోనూ ఇలాగే కొనసాగేలా ఉత్తరకొరియాపై తమ కుటుంబ ఆధిపత్యాన్ని పటిష్టం చేయడానికి కిమ్ తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. అధికార వర్కర్స్ పార్టీలో తన చెల్లెలు కిమ్ యో జాంగ్‌కు ఉన్నత పదవిని కట్టబెట్టారు.

వర్కర్స్ పార్టీ 72వ వార్షికోత్సవం. ఈ సందర్భంగా ఉత్తరకొరియాలో వారోత్సవాలు చేపట్టారు. ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో కిమ్ యో జాంగ్‌ను పార్టీ సెంట్రల్ కమిటీ నిర్ణయాత్మక మండలిలో ప్రత్యామ్నాయ్ సభ్యురాలిగా ఎన్నుకున్నారు.

అంటే చెల్లెలిని నాయకత్వ బాధ్యతలకు మరింత దగ్గరగా తీసుకొచ్చేందుకు కిమ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

30ఏళ్ల కిమ్ యో జాంగ్ తన సోదరుడితో కలిసి తరచుగా మీడియాలో కన్పిస్తుంటారు. 1948లో ఉత్తరకొరియా ఏర్పడిన నాటి నుంచి కిమ్ కుటుంబీకులే ఈ దేశాన్ని పాలిస్తున్నారు.

2011లో కిమ్ జోంగ్ ఉన్ తండ్రి కిమ్ జాంగ్ 2 మరణించారు.

దీంతో కిమ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు.

## పూంచ్ సెక్టార్‌లో పాకిస్తాన్ కాల్పులు

న్యూఢిల్లీ: పాకిస్తాన్ సైనికులు మరోసార్ భారత్‌పై కవ్వింపు చర్యలకు దిగారు. జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించారు. నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వద్ద పహారా కాస్తున్న జవానులపై కాల్పులు జరపడంతో..

భారత సైన్యం ధీటుగా సమాధానం చెప్పింది. దాదాపు రెండు గంటల పాటు ఇరు సైన్యాలకు మధ్య హోరాహోరీ కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఎవరికీ గాయాలు కాలేదని స్థానిక పోలీసు అధికారి ఒకరు పేర్కొన్నారు.

కాగా శుక్రవారం రాత్రి నౌషిరా సెక్టార్లోనూ పాక్ రేంజర్లు కాల్పులకు తెగబడిన సంగతి తెలిసిందే. గతేడాది మొత్తం పాకిస్తాన్ 228 సార్లు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఈ ఏడాది అక్టోబర్ 5 నాటికే దాయాది దేశం ఏకంగా 503 సార్లు కాల్పులకు తెగబడడం గమనార్హం.

## సామియాకు స్వర్ణం

### సింధు తర్వాత మరో భారత షట్లర్‌గా ఘనత

### నాలుగు పతకాలతో భారత్ చరిత్ర




యాంగాన్ : ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో మరో హైదరాబాదీ మెరిసింది. ఏకంగా పసిడి పతకం సొంతం చేసుకుంది. 14 ఏళ్ల సామియా ఇమాద్ ఫారూఖి ప్రతిష్ఠాత్మక ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్ అండర్-15 విజేతగా ఆవిర్భవించింది. పీవీ సింధు తర్వాత ఈ ఘనత సాధించిన రెండో షట్లర్‌గా ఘనత వహించింది. హోరాహోరీగా జరిగిన ఫైనల్లో మూడోసీడ్ సామియా 15-21, 21-17, 21-19 విద్జాజా స్టెఫానీ (ఇండోనేసియా)పై ఘన విజయం సాధించింది. 2012లో పీవీ సింధు ఆసియా అండర్-19 జూనియర్ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం గెలిచాక.. మళ్లీ ఆసియా టైటిల్ గెలిచిన తొలి భారత షట్లర్ సామియా కావడం విశేషం. 56 నిమిషాల తుది పోరులో ప్రత్యర్థి నుంచి సామియాకు తొలి గేమ్‌లో గట్టి ప్రతిఘటన ఎదురైంది. 6-1 ఆధిక్యంలోని దూసుకుపోయిన స్టెఫానీ దాన్ని కాపాడుకొని మొదటి గేమ్‌ను కైవసం చేసుకుంది. అయితే రెండో గేమ్‌లో ఫారూఖి అద్భుతంగా పుంజుకుంది. అటాకింగ్ గేమ్‌తో అదరగొట్టింది. ప్రత్యర్థిపై విరుచుకుపడి తొలుత 6-2తో అనంతరం 13-8తో ఆధిక్యం ప్రదర్శించింది. ఈ దశలో స్టెఫానీ గేరుమార్చి 13-13తో స్కోరు సమం చేసింది. కానీ పట్టుదలగా ఆడిన సామియా రెండో గేమ్ గెలుపొంది పోరును ఉత్కంఠ భరితంగా మార్చింది. ఇక సామియా, స్టెఫానీ నువ్వా నేనా అన్నట్టు తలపడడంతో మూడో గేమ్ తీవ్ర ఉత్కంఠ రేపింది. ఓ దశలో ఇండోనేసియా షట్లర్ 12-7 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. కానీ ఏ మాత్రం తత్తరపాటుకు లోనుకాని సామియా.. తన శక్తియుక్తుల్ని కూడదీసుకుని 16-16తో సమం చేయడమేకాదు అదే ఊపుతో గేమ్ ను, మ్యాచ్‌ను చేజిక్కించుకుంది. కాగా, ఈ టోర్నీలో భారత్ ఏకంగా ఒక స్వర్ణం, మూడు కాంస్యాలు సహా నాలుగు పతకాలతో చరిత్ర సృష్టించింది. సామియా పసిడి పతకంతోపాటు, మహిళల అండర్-15లో ఆషీ రావత్, మహిళల అండర్-17 డబుల్స్‌లో కెయురా మోపాటి, కవిప్రియ, పురుషుల అండర్-15 డబుల్స్‌లో ఆయుష్‌రాజ్, శుభమ్ పటేల్ కాంస్య పతకాలు గెలుపొందారు.

తొలి గేమ్‌లో నెర్వస్‌గా ఫీలయ్యా

మొదటి గేమ్‌లో నెర్వస్‌గా ఫీలయ్యా. కానీ కోచ్ వెన్నుతట్టి ప్రోత్సహించడంతో ప్రత్యర్థికి గట్టి ప్రతిఘటన ఇచ్చా అని మ్యాచ్ అనంతరం సామియా చెప్పింది. మొత్తంగా ఇది క్లిష్టమైన మ్యాచ్. కానీ ఉత్కంఠను అధిగమించి గెలుపొందడం సంతోషంగా ఉంది. దేశానికి టైటిల్ అందించడం గర్వంగా ఉంది అని తెలిపింది. కాగా, అండర్-15 టైటిల్ సాధించిన సామియాతో పాటు పతకాలు నెగ్గిన ఇతర షట్లర్లను భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) అభినందించింది.

## సమకవియం

### పాప భయంకారిణి

ఎందుకు రావు తుఫానులు
ఏలరావు - భూకంపాలు
ఎందుకు రావు - లావాలు
ఏలరావు - కరువు కాటకాలు
భూమి మీద పాపభారం పెరుగుతుంటే;
అద్దెకంటూ అడ్వాన్స్‌లు లక్షలు ఐతే,
అద్దెలు వేలు కొలది ఐతే;
అప్పుకి వడ్డీలు
నూటికి పదిరూపాయిలైతే;
చక్రవడ్డీలు - ఉరిత్రాడుఐతే; ...॥ఎందుకు॥
పెరుగుట -విరుగుటయేగదా!
శ్రమశక్తి ఎనిమిది గంటలైతే;
నాలుగు గంటలు ఎగట్రా చేయించుకుంటే; (వెట్టి చాకిరి)
ఆదుకొన్న రోజులవి
చెడితే పరవసించే రోజులవి
తెల్లవారితే ఎవర్ని ఎలా మోసం చేయాలి ఐతే
ఇది పాపమా!... ఇది పుణ్యమా!
తెలియకుంటే ఐతే... ॥ఎందుకు॥
త్రోవలో వెళ్లె ఒంటరి ఆడమనిషి మెడలో
వస్తువులు చోరికి బలియైతే;
ఇది పాపమా! .. ఇది పుణ్యమా!
తెలియకుంటైతే;
అడ్డదారి కాసి అక్రమ బిల్లు యిచ్చి
జోబిలు నింపుకున్న వ్యవస్థ ఐతే... ॥ఎందుకు॥


...కవితా రచన
యల్.సిద్ధూ
సెల్ నెం: 7702977293

## పంచాంగం

మాసం : అశ్వీయుజ ; తిథి : పంచమి మ.3.01; రోహిణి సా.4.15; ఉ.వ.8.46ల 10.16; రా.వ. 9.28ల 10.57. | మంగళవారం 10-10-2017

**మేషం** : దూర ప్రాంతాలకే చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఏ విషయంలోను నిరుత్సాహం చెందక అంతా మంచికేనని సర్దుకుపోవటం శ్రేయస్కరం. ఎల్.ఐ.సి పోస్టల్ ఏజెంట్లకు ఒత్తిడి, స్పెక్యులేషన్ రంగాల వారికి చికాకులు తప్పవు. బంధువుల మధ్య సయోధ్య నెలకొంటుంది. **వృషభం** : విద్యార్థులకు పోటీ పరీక్షల ఏకాగ్రత, సమయపాలన అవసరం. ఖాదీ, పట్టు, చేనేత, కలంకారీ వస్త్ర వ్యాపారులకు ఆటుపోట్లు తప్పవు. ఉపాధ్యాయులకు ఒత్తిడి, చికాకులు అధికమవుతాయి. ఉద్యోగస్తులకు అధికారుల నుండి ఒత్తిడి, పనిభారం అధికమవుతాయి. **మిధునం** : వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కని పెట్టుకుని ఉండటం శ్రేయ స్కరం. ఏ విషయంలోను ఇతరులపై ఆధారపడక స్వయంకృషినే నమ్ముకోవడం మంచిది. బ్యాంకు వ్యవహారాలలో పరిచయం లేని వ్యక్తులతో మితంగా సంభా షించండి. **కర్కాటకం** : స్త్రీలకు ముఖ్యుల నుంచి ఆహ్వానాలు అందు కుంటారు. అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆలయాలను సందర్శిస్తారు. **సింహం** : మధ్యవర్తిత్వం వహించుట వల్ల ఇబ్బందులను ఎదుర్కొంటారు. మీ మాటకు సంఘంలోనూ, కుటుంబములోనూ ఆమోదం లభిస్తుంది. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదని గమనించండి. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. **కన్య** : రుణాలు, చేబదుళ్లు స్వీకరించవలసి వస్తుంది. మీ సంతానం విద్యా, ఉద్యోగ విషయాలపై శ్రద్ధ అవసరం. స్త్రీలతో సంభాషించునపుడు సంయమనం పాటించండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు ఏకాగ్రత ముఖ్యం. గృహమునకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనాలు తలకిందులవుతాయి. ప్రముఖులను కలుసుకుంటారు. **తుల** : విద్యార్థులకు చదువుతో పాటు ఇతర్రతా ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఇతరు లకు వాహనం ఇచ్చేటపుడు లౌక్యం పాటించండి. దైవ, పుణ్య కార్యాక్రమాల పట్ల చురుకుగా పాల్గొంటారు. **వృశ్చికం** : ఎదుటివారి విషయాలలో జోక్యం చేసు కోవటం వల్ల మాటపడక తప్పదు. స్త్రీలు గత కొంత కాలంగా అనుభవిస్తున్న సమ స్యలు పరిష్కారం కాగలవు. పచారీ, ఫ్యాన్సీ, హోటల్, తినుబండారాలు, క్యాటరింగ్ పనివారలకు పురోభివృద్ధి. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళకు లొంగకుండా స్థిరచిత్తంతో వ్యవహరించవలసి ఉంటుంది. **ధనుస్సు** : ప్రేమికులకు పెద్దల నుండి వ్యతి రేకత, ఇతరత్రా చికాకులు అధికమవుతాయి. కొంతమంది మీ నుండి ధనసహాయం ఆశించవచ్చు. వైద్యులకు చురుకు ధనం, ఆడిటర్లకు ఒత్తిడి, లాయర్లకు కలిసివచ్చే కాలం. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేస్తారు. **మకరం** : ఆశలొదిలేసుకున్న బాకీలు వసూలు కాగలవు. ఉపాధ్యాయులకు ఒత్తిడి, అక్కౌంట్స్ రంగాల వారికి పనిభారం తప్పవు.చిన్నతరహా, కుటీర పరిశ్రమల వారికి ప్రోత్సాహకరం. చిరు వ్యాపారు లకు చికాకులు తప్పవు. బంధువుల రాకపోకలు అధికమవుతాయి. ప్రము ఖులను కలుసుకుంటారు. **కుంభం** : స్త్రీలకు పరిచయాలు, వ్యాపకాలు అధికమవుతాయి. ఉద్యోగస్తుల తొందరపాటు చర్యలు, నిర్లక్ష్యం వల్ల కొత్త సమస్య లెదుర్కోవలసి వస్తుంది. పత్రిక రంగాలో వారు, రచయితలు ఆశించే మర్పులకోసం కొంత కాలం వేచియుండక తప్పదు. **మీనం** : ప్రేమికులకు పెద్దల ఆగ్రహావేశా లకు గురికావలసి వస్తుంది. ఎదుటివారితో సంభాషించేటపుడు మెలకువ వహించండి. రాజకీయనాయకుల కదలికలపై విద్రోహులు కన్నేసిన విషయం గమనించండి.

## పురాణాలలో స్త్రీ పురుష అంతర్భేద కధలు



భారత దేశంలో స్త్రీల పట్ల వివక్ష చూపిస్తారని ఒక అపవాదు ఉంది. కానీ మీరు చరిత్ర ని తిరగేస్తే ఇది నిజం కాదని స్పష్టమవుతుంది. పురాణాలలో ఈ సంప్రదాయానికి వ్యతిరేక ఉదాహరణలు బోలెడు కనిపిస్తాయి. అనేక సందర్భాలలో స్త్రీ పురుష తత్వాల మధ్య విభజన రేఖ అస్పష్టం గా ఉండటం మీకు కనపడుతుంది..పురాతన కవులు, రచయితలు ఈ స్త్రీ పురుష వివక్ష ని ధైర్యంగా తరచి చూసి ఒక్కోసారి మార్చడానికి కూడా ప్రయత్నించారు. మీ కర్మానుసారం మీరు ఆడ, మగ గానో, జంతువుగానో లేదా చెట్టుగానో పుడతారు. ఎలా పుట్టినా మృత్యు సమయం లో ఆత్మ జీర్ణ వస్త్రాన్ని విడిచిపెట్టినట్లు ఈ శరీరాన్ని వదిలి వెళ్ళిపోతుంది. అందుకే ఆత్మ స్త్రీ లేదా పురుష లింగం కాదు. ఇప్పుడు మనం హిందూ పురాణాలలో లింగ వివక్ష కి అందని కధలు చూద్దాము. ఈ కధలలో మగవారు ఆడవారి పాత్ర పోషించడానికి సిద్ధపడ్డ సంఘటనలు, మగవారుగా బ్రతికిన ఆడవారు,ఇంకా ఆడా మగా ఒకటే అని నిరూపించే కధలని చూద్దాము. ఇవి చదివి మీ భావాలని, కామెంట్లని దిగువ తెలియ చెయ్యడానికి సంకోచించకండి.

**అర్ధనారీశ్వరుడు:** అర్ధనారీశ్వర శబ్దానికి సగం స్త్రీ సగం పురుష తత్వం కలిగిన భగవంతుడని అర్ధం. మహా శివుడు మరియు ఆయన దేవేరి పార్వతి యొక్క ఏక రూపం ఈ అర్ధనారీశ్వరం. ఈ రూపం పురుష స్త్రీ తత్వాల ఏకీకరణకి ప్రతీక. ఒకళ్ళు లేకుండా ఇంకొకళ్ళు లేరూని, ఒకళ్ళు ఇంకొకళ్ళ కంటే ఎక్కువ కాదు అనీ, మరియు తనలో ఈ రెండు లక్షణాలనీ ఉంచుకున్నవాడే పరిపూర్ణ జీవితం గడపవచ్చనీ ఈ రూపం మనకి తెలియచేస్తుంది.మోహిని శ్రీ మహా విష్ణువు అవతారం గా మోహినీ అవతారం మనకి హిందూ పురాణాలలో చాలా చోట్ల కనిపిస్తుంది. ఈ రూపాన్ని గురించి మూడు ముఖ్య కధలు చెప్తారు. మొదటిది సాగర మధనం తరువాత అమృతానికి సంబంధించిన తగవు తీర్చడానికి వచ్చిన రూపం. శ్రీ మహా విష్ణువు అందమైన మోహినీ రూపం ధరించి తెలివిగా అమృతాన్ని దేవతలకి మాత్రం పంచుతాడు. రెండోది పరమేశ్వరుణ్ణి భస్మాసురుడు అనే రాక్షసుడి బారి నుండీ కాపాడిన మోహినీ అవతారం.ఈ మనోహరమైన మోహినీ అవతారం భస్మాసురుడు తననను తాను అంతం చేసుకు నేటట్లు చేసింది. మనోహరమైన మోహినిని పరమేశ్వరుడు మోహించడం వల్ల అయ్యప్ప జననమయ్యింది. అయ్యప్ప దక్షిణ భారతం లో ప్రసిద్ధి చెందిన భగవత్ స్వరూపం. ఇంక మూడోది మహా భారతంలో. అర్జునుడి కొడుకైన అరవనుణ్ణి యుద్ధం లో పాండవుల విజయం కోసం బలి ఇవ్వ వలసి వస్తుంది.కానీ అరవణుడికి చనిపోయే ముందు వైవాహిక సుఖాలని అనుభవిం చాలని కోరిక ఉంటుంది.కానీ చావు రాసి పెట్టి ఉన్న ఈ మనిషిని పెళ్ళాడేందుకు ఏ స్త్రీ ముందుకురాకపోయేసరికి శ్రీ కృష్ణుడే మోహినిగా మారి అరవనుణ్ణి పెళ్ళాడి అతను చనిపోయాకా దఃఖిస్తాడు.శిఖండి ద్రుపద మహారాజుకి కుమార్తె గా పుట్టిన శిఖండి ని మగ పిల్లవాడిలాగ పెంచుతారు. కొన్ని కధల ప్రకారం శిఖండి కి అమ్మాయినిచ్చి పెళ్ళి చేసారుట కూడా. శిఖండి తన స్త్రీ తత్వాన్ని తాను వైవాహిక జీవితం గడపడానికీ , భీష్ముడిని చంపటానికీ ఒక

### సంకీర్తన

యక్షునికిచ్చినట్లు కూడా కొన్ని కధలు ప్రచారంలో ఉన్నాయి. చాలా కధల ద్వారా శిఖండి ఆడా ఉభయ లింగం అని తెలుస్తుంది. బృహన్నల తనని తిరస్కరించాడన్న కోపం తో ఊర్వశి అర్జునుడిని ఒక సంవత్సరం స్త్రీగా మారతాడని శపిస్తుంది.కానీ ఈ శాపం అజ్ఞాతవాసం ఆఖరి సంవత్సరం లో విరాట మహారాజు కొలువులో బృహన్నల అనే స్త్రీలా ఉండటానికి ఒక వరంలా పనికొచ్చింది. కానీ కొంతమంది ఆ శాపం వల్ల అర్జునుడు స్త్రీగా కాకుండా నపుంసకుడిగా మారాడని కూడా అంటారు. సుద్యుమ్న/ఇల పరమశివుడి తోటలోకి అనుమతి లేకుండా పొరపాటున ప్రవేశించడం వల్ల తన జీవితం లో సగ భాగం స్త్రీగా మారతాడని మగవాడిగా పుట్టిన సుద్యుమ్నుడికి శాపం వచ్చింది. అతను ప్రతీ నెలా తన తత్వాన్ని(లింగాన్ని) మార్చుకుంటుండేవాడు. అతని స్త్రీ స్వరూపాన్ని ఇలగా వ్యవహరిస్తారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# కేసీఆర్‌ను గద్దె దించడమే లక్ష్యంగా ఏకం కావాలి

### దళితులకు మందకృష్ణ మాదిగ పిలుపు



జక్రాన్‌పల్లి : తెలంగాణ సాధనలో అండగా ఉన్న దళితలపైనే దౌర్జన్యాలకు పాల్పడుతున్న కేసీఆర్‌ను గద్దె దించేచడమే లక్ష్యంగా దళితులు ఏకం కావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. 1 జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామంలో మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిని దళితుడినే చేస్తానని ప్రకటించిన కేసీఆర్ మాట మార్చారన్నారు. తెలంగాణ అసెంబ్లీలో 18 మంది దళిత ఎమ్మెల్యేలు ఉంటే ఒక్కరికీ మంత్రి పదవి ఇవ్వలేదని పేర్కొన్నారు. దళితులకు సంబంధించిన సాంఘిక సంక్షేమ శాఖ ఛైర్మన్ పదవిని సైతం వేరే సామాజిక వర్గం వ్యక్తికి ఇచ్చారన్నారు. ఉద్యమకారులను కాదని తెలంగాణ ద్రోహులకు తెరాస పార్టీలో చోటు కల్పించారని విమర్శించారు. ఐకాస అధ్యక్షుడు కోదండరాంను వాడు..వీడు అంటు సంబోధించడం కేసీఆర్ అహంకారానికి నిదర్శనమన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఎమ్మార్పీఎస్ కీలకపాత్ర పోషించిందని గుర్తుచేశారు. కేవలం మాదిగల అభ్యున్నతికే కాదు సమాజం కోసం కూడా అహర్నిశలు పాటుపడిందన్నారు.

భారతరత్న ఇవ్వాలి

భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని ఉపప్రధానిగా దేశానికి సేవలందించిన బాబు జగ్జీవన్‌రాం ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. ఆయన విగ్రహాల ఏర్పాటు ద్వారా గౌరవించాలన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యంగాన్ని పార్లమెంటులో ఆమోదించడానికి విశేషంగా కృషి చేసింది ఆయనేనన్నారు. కాంగ్రెస్ పార్టీ పలుమార్లు జగ్జీవన్‌రాంను ప్రధానిగా చేస్తామని చెప్పి, చివరకు మోసం చేశారన్నారు. 40 ఏళ్ల పాటు దేశసేవ చేసిన ఆయనకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లాధ్యక్షుడు నాగభూషణం, సర్పంచి సునీత, ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, దళిత సంఘాల నాయకులు సాయి, పిల్లి విజయ్, ప్రవీన్, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉలిక్కి పడ్డ గుండ్రాతిమడుగు..!

### అర్ధరాత్రి గ్రామాన్ని చుట్టుముట్టిన పోలీసు బలగాలు

గుండ్రాతిమడుగు : ప్రశాంతంగా ఉన్న గుండ్రాతిమడుగు(స్టేషన్) గ్రామం ఒక్క సారిగా ఉలిక్కి పడింది. ఐదు రోజులుగా రాయల వర్గానికి చెందిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అజ్ఞాత నేత ఆవర్గం జిల్లా కార్యదర్శి గోపన్న, మరో దళనేత అశోక్ గ్రామంలో తలదాచుకున్నారన్న సమాచారంతో మహబూబాబాద్ జిల్లా పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి గ్రామంపై దాడి చేశారు. న్యూడెమోక్రసీ సానుభూతి పరుల ఇళ్లలో గుడుంబా, పానుమసాలా విక్రయాలు చేస్తున్నారంటూ పోలీసులు సోదాలు నిర్వహించి దళనేతల కోసం వెతికారు. గ్రామంలో ఓ పంచాయతీ నిమిత్తం వచ్చిన దళనేతలు పోలీసుల రాకను గమనించి తుపాకులు వదిలేసి పారిపోయారు.

ఆ పార్టీకి చెందిన ఓ మహిళ కార్యకర్త ఇంటిలో దాచిపెట్టిన గోపన్న ఏకే 47తుపాకి, అశోక్‌కు చెందిన స్టెన్‌గన్ ఆయుధా లను పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో స్థానికులు ఆందోళన చెందారు. గోపన్న రెండో భార్యది గుండ్రాతిమడుగు కావడంతో ఈ ప్రాంతంలో దళ నేతల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఇందులో భాగంగానే గోపన్న ఆచూకీని తెలుసుకుని దాడులు జరిపారు. నక్సల్స్ నుంచి కాల్పులు జరిగితే పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవహరించేలా ప్రణాళిక ప్రకారం గ్రామాన్ని చుట్టుముట్టినప్పటికీ దళనేతలు పోలీసుల కళ్లు గప్పి తప్పించుకున్నారు.

భోజనం కోసం వెళ్లడంతో తప్పిన ముప్పు: గోపన్న, మరో దళనేత అశోక్ ఆశ్రయం పొందిన ఇంటిలో ఆయుధాలను వదిలి భోజనం కోసం మరో ఇంటికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ సమయంలోనే పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టడంతో సమాచారాన్ని అందుకున్న దళనేతలు అక్కడి నుంచి హుటాహుటిన పారిపోయినట్లు సమాచారం. పోలీసులు పూర్తిస్థాయిలో ఇళ్లను సోదాచేస్తుండగానే కాలినడకన గ్రామాన్ని విడిచి దళనేతలు తమకున్న అనుభవంతో తృటిలో తప్పించుకొని ప్రాణాలు దక్కించున్నారు. గోపన్న, అశోక్ అక్కడి నుంచి తప్పించుకున్నారనే సమాచారంతో ఆ పార్టీ సానుభూతి పరులు వూపిరిపీల్చుకున్నారు. ఆపార్టీ సానుభూతి పరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆ దళనేతలు వచ్చిన నేపథ్యం, ఎన్ని రోజులుగా మకాం వేసి ఉన్నారనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నట్టు తెలుస్తోంది.

## 13వ డివిజన్‌లో మేయర్ పర్యటన

ఖమ్మం కార్పొరేషన్: ఖమ్మం నగరంలోని 13వ డివిజన్ దంసలాపురం, కొత్తూరు ప్రాంతాల్లో నగరపాలక సంస్థ మేయర్ డా.పాపాలాల్ సోమవారం పర్యటించారు. డివిజన్‌లోని ప్రధాన వీధుల్లో కల్వర్టులు లేకపోవడం వల్ల తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయని స్థానిక కార్పొరేటర్ నిరీషరెడ్డి మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిశీలించిన మేయర్ కల్వర్టుల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు చేయాలని డిఈఈ సుబ్రహ్మణ్యంకు సూచించారు. మేయర్ వెంట ఏఈ నవ్యజ్యోతి, ఇతర అధికారులు ఉన్నారు.

# పట్టాల బలోపేతంపై ఇంజినీర్ల దృష్టి

### 11న పరిశీలించనున్న రైల్వే అధికారులు


కాజీపేట : దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న రైలు ప్రమాదాల నేపథ్యంలో కాజీపేట సబ్‌డివిజన్ పరిధిలో పట్టాల పటిష్టతపై రైల్వే దృష్టి సారించింది. ఇంజినీరింగ్ విభాగానికి ప్రత్యేక సూచనలిచ్చింది. దీంతో దేశవ్యాప్తంగా అన్ని చోట్ల పట్టాల పటిష్ఠత కోసం పలు కార్యక్రమాలు చేస్తున్నారు. ఈనెల 11వ తేదీన రైల్వే బోర్డు ముఖ్య భద్రతా అధికారి బృందం కాజీపేట సబ్ డివిజన్‌లోని పట్టాలను పరిశీలించే అవకాశముంది. అప్రమత్తమైన రైల్వే అధికారులు పట్టాల్లోని లోపాలను గుర్తించే పనిలో పడ్డారు. కాజీపేట ఉత్తర, దక్షిణ, మధ్య ఇంజినీరింగ్ విభాగాలు తమ సిబ్బందితో పట్టాలను సరి చేసే పనిలో నిమగ్నమయ్యారు. కాజీపేట సమీపంలో సుమారు 50 మంది సిబ్బందితో మధ్య ఇంజినీరింగ్ విభాగం పట్టాల బోల్టులు తీసి మళ్లీ బిగించడం, అవసరమున్న చోట పట్టాల కింద కంకరను తీసి తిరిగి నింపడం, పట్టాలు బలహీనంగా ఉన్న చోట వాటికి అతుకులు వేయడం చేస్తున్నారు. అటు విజయవాడ వరకు, ఇటు జమ్మికుంట, సికింద్రాబాద్ కాజీపేట మార్గంలో ఎక్కడ చూసినా ఇంజినీరింగ్ గ్యాంగ్‌మెన్‌లే పనులు చేస్తూ కనిపిస్తున్నారు.

# కొనసాగుతున్న వర్షాలు

వరంగల్ : ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం కురిసింది. రాత్రి గంటపాటు ఏకదాటిగా వర్షం కురవడంతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో నగరంలోని కాలనీలలో నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఖాళీ ప్లాట్లు నీటి కుంటలుగా మారాయి. హన్మకొండ, హసన్‌పర్తి, కాజీపేట, ధర్మసాగర్, స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్, ఐనవోలు, ఆత్మకూర్, సంగెం, ఖిలావరంగల్, పరకాల, వర్ధన్నపేట, రఘునాథడపల్లి, నర్సంపేట, రేగొండ, తొర్రూరు, ములుగు, గీసుకొండ, కమలాపూర్, భీమదేవరపల్లి, వేలేరు, శాయంపేట, నల్లబెల్లి, గోవిందరావుపేట, గణపురం, మరిపెడ, ఎల్కతుర్తి, చిల్పూర్, నర్మెట్ట తదితర మండలాల్లో వర్షం కురిసింది.

పంట ఉత్పత్తులకు నష్టం: ప్రధాన పంట పత్తి బుగ్గలు తీసే సమయంలో వర్షాలు మొదలయ్యాయి. చేతికి అందివచ్చిన మొదటి పత్తి పంటకు తీవ్రంగా నష్టం జరుగుతోంది. పగిలిన పత్తిబుగ్గలలోకి వర్షపు నీరు పోయి నల్లగా గుడ్డిపత్తిగా మారిపోతుంది. మొక్కజొన్న పంట కోత దశలో ఉంది. ఇప్పటికే కోసిన కంకులు, మొక్కజొన్నలు కల్లాల్లో ఉన్నాయి. ఐదారు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో మొలకలు వచ్చి అక్కరకు రాకుండా పోతున్నాయని రైతులు తెలిపారు. పత్తి పంటలలో నీరు చేరి మొక్కలు ఎండి పోతున్నాయి. వరిలో అధిక నీరు చేరడంతో దోమ, మసిపేను వంటి చీడలు సోకి పంటకు నష్టం చేస్తున్నాయి.

# పోచారం ఎత్తు పెంచేవరకు పోరాటం ఆగదు



ఎల్లారెడ్డి : పోచారం ప్రాజెక్టు ఎత్తు పెంచాలని, ఆయకట్టు రైతులకు రెండు పంటలకు సాగునీరు అందేలా చూడాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రైతు అఖిల పక్షం ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఆదివారం పోచారం చివరి ఆయకట్టు అన్నాసాగర్‌లోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు జెండాను వూపి పాదయాత్రను ప్రారంభించారు. పోచారం ప్రాజెక్టులోకి వరద నీరు అధికంగా ఉన్నాయని, దాని సామర్థ్యం పెంచి రైతులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నేరవేర్చాలని డిమాండ్ చేశారు. వందేళ్ల ప్రాజెక్టు అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం విఫలం చెందుతుందన్నారు. ప్రాజెక్టు ఐదు అడుగుల ఎత్తు పెంచితే మరో టీఎంసీ నీటి సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఎత్తు పెంచడం వల్ల ఎలాంటి నష్టం వాటిల్లదని స్పష్టం చేశారు. ప్రాజెక్టు ముంపు ప్రాంతం లెవల్ వరకు ఐదు అడుగుల నీటి సామర్థ్యం ఉంటుందని నీటిపారుదల శాఖ అధికారులు గతంలో నివేధికలు ఇచ్చారని గుర్తు చేశారు. ఎత్తు పెంచడం వల్ల ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట రైతులకు, ప్రజలకు సాగు, తాగునీటి సమస్యలు లేకుండా ఉంటాయని పేర్కొన్నారు. ఎత్తు పెంచితేనే రైతులకు ఖరీఫ్, రబీల్లో 11 వేల ఎకరాల్లో పంటలు పండుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మాల్తుమ్మెద విత్తన క్షేత్రం ఎత్తిపోతలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉదయం 8 గంటలకు అన్నాసాగర్ గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. అజామాబాద్, తిమ్మారెడ్డి, కళ్యాణి, రత్నపూర్, లింగారెడ్డిపేట, ఎల్లారెడ్డి మీదుగా మాచాపూర్ వరకు రైతు అఖిల పక్షం నాయకులు, రైతులు పాదయాత్ర చేపట్టారు. మొదటి రోజు 25 కిలోమీటర్లు, రెండో రోజు 25 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి పోచారం ప్రాజెక్టు చేరుకుంటామన్నారు. 9వ తేదీ నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పాదడయాత్రలో అఖిల పక్షం నాయకులు బొల్లినర్సింహారెడ్డి, వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి, నల్లమడుగు సురేందర్, ప్రతాప్‌రెడ్డి, సాయిప్రకాష్ దేశ్‌పాండే, కృష్ణారెడ్డి, విఠల్‌గౌడ్, దేవేందర్, సత్యం, మనోహర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సాయిరాంగౌడ్, ఇమ్రాన్, నర్సింలు, రైతులు పాల్గొన్నారు.

# సింగరేణి విద్యుతు కేంద్రానికి దేశంలో 8వ స్థానం

గోదావరిఖని : విద్యుత్తు ఉత్పత్తిలో సింగరేణి విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం 8వ స్థానం దక్కించుకుంది. దేశంలోని వివిధ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల ప్రతిభను గుర్తించి ఎలక్ట్రికల్ అథారిటీ ఆఫ్ ఇండియా ర్యాంకులను నిర్ణయించింది. దేశంలోనే సింగరేణి విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం 86.87 శాతం పీఎల్‌ఎఫ్‌తో ప్రతిభను చాటింది. దేశంలోని 25 థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల పనితీరు ఆధారంగా ఎంపిక చేసిన వాటిలో సింగరేణి సంస్థ విద్యుత్తు కేంద్రం ఎనిమిదో స్థానాన్ని దక్కించుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని ఏ విద్యుత్తు ఉత్పత్తి సంస్థ కూడా 8వ స్థానానికి ముందు చేరుకోలేకపోయింది. రామగుండం థర్మల్ విద్యుత్తు కేంద్రం 19వ స్థానాన్ని దక్కించుకుంది. పశ్చిమబంగాలోని బుడ్గి థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం మాత్రమే మొదటి స్థానాన్ని దక్కించుకుంది. మిగతా రాష్ట్రాలకు చెందిన విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు మొదటి ఏడు స్థానాలు దక్కించుకోగా తెలంగాణ నుంచి సింగరేణి విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం 8వ స్థానంలో నిలిచింది. సింగరేణి ఇప్పటి వరకు 98.43 శాతం పీఎల్‌ఎఫ్ సాధించి ఆరు నెలలుగా 4613 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి సాధించింది. అందులో రాష్ట్ర ప్రభుత్వ గ్రిడ్‌కు 4325 మిలియన్ యూనిట్ల విద్యుత్తును అందించింది. దేశంలోనే 8వ స్థానంలో నిలిచిన సింగరేణి విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలో పని చేసే ఉద్యోగులను సీఎండీ శ్రీధర్ అభినందించారు. రానున్న కాలంలో కూడా ఇదే విధంగా రికార్డు స్థాయిలో విద్యుత్తు ఉత్పత్తి సాధించడంతో పాటు సంస్థ మనుగడకు మరింత దోహదం చేయాలని ఆయన ఆకాంక్షించారు.

# హక్కుల సాధనకు దళితులు పోరాడాలి

హైదరాబాద్ : హక్కుల సాధనకు దళితులు సింహాలై గర్జించాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు కె.రాములు కోరారు. పేటలో ఆదివారం డా. బిఆర్ అంబేడ్కర్ సమర సత వేదిక ఆధ్వర్యంలో సన్మానసభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయనకు పట్టణంలో సమరసత వేదిక, భాజపా నగరశాఖ, దళిత మోర్చా నేతృత్వంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి రాములు పూలమాల వేసి నివాళులర్పించారు. చౌరస్తా నుంచి భాజపా నేతలు నాగురావు నామాజీ, రతంగ్‌పాండ్‌రెడ్డితో కలిసి ఆయన మెట్రో ఫంక్షన్‌హాల్ వరకు చేరుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాములు మాట్లాడుతూ.. ఈ జిల్లా వాసిగా వెనుకబడిన పాలమూరులో దళితులకు దక్కాల్సిన హక్కులు,అందాల్సిన రుణాలు, దళితులపై దాడులు చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదుకు కమిషన్ ద్వారా సంబంధిత అధికారులను ఆదేశిస్తానని చెప్పారు. ఇప్పటికీ దళితులపై దాడులు, దళిత యువతులపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ తరపున రాష్ట్రంలో సీఎం దళితులకు మూడెకరాల భూమి ఎక్కడెక్కడ ఇచ్చారు? ఎంత మందికి ఇచ్చారన్నారు. రెండు పడకగదుల కేటాయింపులో దళితులకు తప్పనిసరిగా 12 శాతం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ కృష్ణఆదిత్య, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. దళితుల కోసం అమలు చేస్తున్న చట్టాలు, కమిషన్ల గురించి దళితులందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం సమరసత వేదిక అధ్యక్షుడు ఆశప్ప, కమిటీ సభ్యులతో పాటు దళితమోర్చా నాయకులు, భాజపా నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఇందిర , తహశీల్దార్ పార్థసారథి, పుర కమిషనర్ సురేష్, భాజపా నేత కొండయ్య, నాయకులు నింగిరెడ్డి, హాజమ్మ , వింఢో అధ్యక్షుడు సత్యయాదవ్, ఎంపీపీ మణెమ్మ, పుర వె%స్‌ఛైర్మన్ నందునామాజీ పాల్గొన్నారు.

అక్రమ కేసులు నమోదు చేసిన అధికారులపై చర్యలు

వూట్కూరు : వూట్కూరు మండల కేంద్రంలో గత నెల 3న ఇరువర్గాల ఘర్షణలో దళితులపై అక్రమ కేసులు పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా అదుపులోకి తీసుకుని కొట్టిన పోలీసు అధికారులపై చర్యలకు సిఫార్సు చేస్తామని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములు హెచ్చరించారు. ఆయన ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. వూట్కూరు ఘటనపై సీనియర్ న్యాయవాదులతో విచారణ జరిపించేందుకు రాష్ట్రపతికి దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని వివరించారు. నేరళ్ల ఘటనకు పాల్పడిన పోలీసులకు పట్టిన గతే వూట్కూరు ఘటనలో పాలు పంచుకున్న పోలీసు ఉన్నతాధికారులకు పడుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ తిరుపతయ్య, హాస్టల్ వార్డెన్ విజయ్ కుమార్, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు, భాజపా నేతలు కొండయ్య, జి.నింగిరెడ్డి, వీహెచ్‌పీ నేత మద్ది యాదిరెడ్డి, హాజమ్మ పాల్గొన్నారు.

# ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు లక్ష్యాలు

### ఉత్తర్వులు జారీచేసిన గ్రామీణాభివృద్ధి శాఖ


ఖమ్మం : ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పనులు కల్పించడంలో లక్ష్యాలు నిర్దేశిస్తూ ఉపాధి క్షేత్రసహాయకులకు గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. కూలీలకు నిర్దేశించిన పని దినాలు కల్పించిన క్షేత్రసహాయకులకే వారి పనితీరు ఆధారంగా వేతనం ఇవ్వడంతోపాటు, 3వేల పనిదినాలు కల్పించలేని క్షేత్రసహాయకులను ఉద్వాసన పలకాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. క్షేత్రసహాయకులు అనేక మంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కూలీలకు పనులు దొరక్క ఉపాధి కోల్పోవడంతోపాటు, ప్రణాళికకు అనుగుణంగా నిర్దేశించి లక్ష్యాల సాధనలో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రభుత్వం క్షేత్ర సహాయకులకు లక్ష్యాలను నిర్దేశిస్తూ ఉత్తర్వులు జారీచేయడంతో పాటు దీనికి సంబంధించి మార్గదర్శకాలు జారీచేసింది.

గ్రామపంచాయతీల ఆధారంగా ఉపాధి హామీ పథకంలో నమోదై ఉన్న ప్రతి కూలీతో శ్రమశక్తి సంఘాలు ఏర్పాటుచేశారు. వీరికి పనికల్పించేందుకు ప్రతి గ్రామపంచాయతీకి ఒక క్షేత్ర సహాయకుడ్ని నియమించారు. హెచ్‌ఆర్ పాలసీ ప్రకారం ఒప్పంద పద్ధతిలో నియమితులైన వీరి ఉద్యోగ కాలపరిమితి జులై 1న నుంచి జూన్ 30వరకు ఉంటుంది. గడువు ముగిసిన అనంతరం వారికి తరువాతి ఏడాదికి నవీకరణ చేస్తారు. వీరికి అన్ని రకాల భత్యాలు కలిపి రూ.10వేలు వేతనం చెల్లిస్తున్నారు. ఇక నుంచి వీరంతా వారి పనితీరు ఆధారంగానే కొనసాగనున్నారు.

క్షేత్రసహాయకుల పనితీరు మార్గదర్శకాలను ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది. గ్రామంలో జాబ్‌కార్డులు ఉన్న కూలీలందరికి తప్పనిసరిగా పనికల్పించాలి. వాటి వివరాలను పంచాయతీ రిజిష్టర్‌లో నమోదుచేయాలి. కూలీలందరికి పనికి సంబంధించి రసీదులు అందించాలి. సామాజిక తనిఖీల్లో, బినామీ కూలీలు, బోగస్‌మస్టర్‌లు, పనులు ప్రారంభించకపోవడం, తప్పుడు కొలతలు వంటి లోపాలు లేకుండా చూసుకోవాలి.

క్షేత్ర సహాయకులను వారి పనితీరు ఆధారంగా మూడు విభాగాలుగా విభజించి వేతనాలు చెల్లించాలని నిర్ణయించారు. జులై ఒకటి నుంచి జూన్ 30వరకు ఏడాది కాలంలో గ్రామపంచాయతీ పరిధిలో కూలీలకు ఆరువేల పనిదినాలు కల్పించిన క్షేత్రసహాయకులు ఒకటో విభాగం కిందకు వస్తారు. వీరికి మాత్రమే పూర్తివేతనం రూ.8900 అలవెన్స్ రూ.1100 చెల్లిస్తారు. 3వేల నుంచి 5999 పనిదినాలు కల్పించివారిని రెండో విభాగం కింద వేతనం రూ.3900, అలవెన్స్ రూ.1100 చెల్లిస్తారు. మూడు వేల కంటే తక్కువ పనిదినాలు కల్పించే వారిని మూడో విభాగం కిందికి వస్తారు. వీరిని తరువాతీ ఏడాదికి నవీకరణ చేయకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వారి స్థానంలో సీనియర్ మేట్‌లకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు.

# రైతులు బాగుండాలని కోరుకుంటున్నా..




### మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

రుద్రూర్ : రైతు బావుంటేనే.. రాష్ట్రమే కాకుండా దేశం కూడా బాగుంటుంది..అందుకే రైతులు. ఆత్మగౌరవంతో ఎలాంటి అప్పులు లేకుండా తలెత్తుకుని తిరిగే రోజును తీసుకొస్తామని మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంబం గ్రామంలో సుమారు రూ.1.10కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. గ్రామ ముదిరాజ్ సంఘానికి భూమి పూజ చేశారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. కుందాపూర్, అంబం గ్రామస్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ప్రసంగించారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి సింగూరు జలాలను నిజాంసాగర్‌లోకి విడుదల చేశామన్నారు. ఈ నీటిని రబీ పంటకు రైతులు వినియోగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చే ఏడాది సైతం ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధి పొలాలకు రెండు పంటలకు సాగునీరు అందిస్తామని భరోసా ఇచ్చారు. వచ్చే రబీ సీజన్‌లో ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకం ఎకరాకు నాలుగువేలు రైతుల ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. రైతును రాజుగా చూడటమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. అప్పు మాఫీ చేయడమే కాదు.. అప్పు చేయకుండా రైతును చేయడానికి ప్రభుత్వం రాయితీ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని చెప్పారు. రసాయనిక ఎరువులు అతిగా వినియోగించడం మూలంగా పంటలకు చీడపీడలు వ్యాపిస్తున్నాయని, సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. సింగూరు జలాలను మిషన్ భగీరథ ద్వారా గ్రామ గ్రామానికి అందిస్తున్నామని చెప్పారు. డిసెంబర్ 31 నాటికి ప్రతీ ఇంటి వద్ద నల్లాలను సర్పంచులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతీ ఆడబిడ్డ ఇంటి వద్దే స్వచ్ఛమైన నీరు పట్టుకునేలా దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం చేస్తుందన్నారు.

ఈ సమావేశంలో సర్పంచి ఇందూరు నాగమణి, ఎంపీపీ చింగ్లీభాయి, జడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ నారోజి గంగారాం, ఎంపీటీసీ పట్టెపు రాములు, సొసైటీ ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ఇందూరు సాయిలు, ఉపసర్పంచి మంత్రి గంగారాం, నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, భజ్యానాయక్, అధికారులు పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్యకరమైన ఆహారాలు



ఆరోగ్యకరమైన ఆహారాలు అంటే సహజంగా పచ్చటి కూర గాయలు, ఆకు కూరలు, తాజా పండ్లు, గింజ ధాన్యాలు, పప్పులు మొదలైనవిగా వుంటాయి. అయితే, కొంత మంది మహిళ లకు 30 సంవత్సరాల వయసు పైబడినవరికి విటమిన్లు, ప్రొటీన్లు అధికంగా వుండే ఆహారాలు కావాలి. వ్యాధులతో పోరాడటానికి, సంతానోత్పత్తికి, ఆరోగ్యకరమైన శరీరంకొరకు వీరికి ఈ ఆహారాలు ప్రధానం. మీరు కనుక 30 సంవత్సరాలుపైబడిన మహిళలైతే, విటమిన్లు, ప్రొటీన్లు అధికంగా వుండే ఆహారాలను మీ రోజువారీ ఆహారంలో తప్పక చేర్చండి.

30 సంవత్సరాలు పైబడిన మహిళలకు ఆహారం!

ఐరన్ అధికంగా - మహిళ ప్రతినెలా తన శరీరంనుండి పిరియడ్ కారణంగా కొంత ఐరన్ నష్టపోతుంది. ఐరన్ తగ్గితే అది మిమ్మల్ని బలహీనపరచి శరీరంలో రక్తహీనత ఏర్పరుస్తుంది. ఐరన్ అధికంగా వుండే ఆహారాలు, అలసట పొగొట్టి, రక్తహీనత, జుట్టు రాల టం, తలనొప్పి వంటివి కలిగించ కుండా వుంటాయి. పచ్చని కూరలు, ఆకు కూరలు, బచ్చలి, గోంగూర, బీన్స్ వంటి వాటిలో ఐరన్ అధికం. లివర్, టూనా చేప కూడా అధిక ఐరన్ కలిగి వున్నాయి.

పండ్లు - 30 సంవత్స రాలు పైబడిన మహిళకు పచ్చి లేదా తాజా పండ్లు మంచి పోషకాలనిస్తాయి. వీరికి ఐరన్, కాల్షియం రెండూ ప్రధానం. బొప్పాయి, బఠాణీ, ఆలివ్, స్ట్రాబెర్రీ, ఆరెంజ్, కేన్ బెర్రీలు జంక్ ఫుడ్ బదులుగా తినండి. ఆకలి, అలసట లను వదలాలంటే పండ్లు తినాలి

కాల్షియం - విటమిన్ డి, మెగ్నీషియంలతో ఇది వస్తుంది. 30 సంవత్సరాల పైన మంచి కార్బోహైడ్రేట్లు, కొవ్వులు మిమ్మల్ని రక్తపోటునుండి, గుండె జబ్బులనుండి కాపాడ తాయి. కొవ్వు తక్కువగా వున్న పాల ఉత్పత్తులు, గోంగూర, బచ్చలి, వేపిన చేపలుసల్మాన్, టూనా, కొవ్వు తక్కువవుండే జున్ను, గుడ్లు, వెన్నతీసిన పాలు , గింజలు తినాలి. జంతు సంబంధిత ప్రొటీన్లు శరీరంనుండి కాల్షియం తీసుకుంటాయి.

కనుక వీటిని తగ్గించండి. సాధ్యమైన మేరకు మొక్కల సంబంధిత ఆహారాలు తినాలి.

కొవ్వులు - చెడు కొల్లెస్టరాల్ తగ్గాలంటే మోనోశాట్యురేటెడ్ ఆహారాలు తినాలి. ఇవి గుండె జబ్బులు, రక్తపోటు, షుగర్ వ్యాధి రాకుండా చేస్తాయి.

బాదంపప్పులు, జీడిపప్పులు, బీఫ్, ఓట్ మీల్, పస్తా, బ్రౌన్ బ్రెడ్, వాల్ నట్స్, నువ్వులు, గుమ్మడి గింజలు మొదలైనవి మోనో శాట్యురేటెడ్ కొవ్వులు కలిగి వుంటాయి. మొక్క సంబంధిత నూనెలు ఆలివ్ నూనె, కెనోలా నూనె, గ్రేప్ సీడ్ నూనె, అవిసె గింజల నూనె మొదలైనవి కూడా 30 ఏళ్ళ మహిళలకు మంచివే.

ఈ వయసు మహిళలు, ఆహారం ఒకటే తీసుకుంటే చాలదు. శారీరక సౌష్టవం కొరకు క్రమం తప్పకుండా కొంత సమయం రోజూ వ్యాయామం కూడా చేయాలి. తగినంత నీరు తాగి శరీరంలోని మలినాలు విసర్జించాలి.




# డెంగ్యూ జ్వరానికి నివారణ మార్గాలు



డెంగీ అనేది ఒక వైరస్. 'ఈడిస్ ఈజిప్టై' అనే ఒక రకం ఆడదోమ కుట్టడం ద్వారా ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంటుంది. ఈ వైరస్ జీవితచక్రమం దోమల నుంచి మనుషులకు, మనుషుల నుంచి దోమలకు ఇది ఒక విష వలయంలా ఉంటుందన్నమాట. దోమ, దోమ కుట్టిన 5 నుంచి 6 రోజులకు జ్వరం ప్రారంభమవుతుంది. పగలు కుట్టే దోమల వల్ల ఈ విషజ్వరం వ్యాపిస్తుంటుంది. దోమలకు ఆవాసం: నిలువ నీళ్లల్లో ఈడిస్ ఈజిప్టై దోమ గుడ్లు పెడుతుంది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, అండర్‌గ్రౌండ్ ట్యాంకులు, కూలర్లు, ఇంట్లోని పాత్రలు, ఫ్లవర్‌వాజులు, నీటి కుండీలు, పాతటైర్లు, పనికిరాని పడేసిన బాటిళ్లు, పాత్రలు, డబ్బాలు... ఇలా ఎక్కడ నీళ్లు నిలువ ఉండటానికి అవకాశం ఉంటే అక్కడ ఈ దోమ గుడ్లు పెడుతుంది. ఈ నీళ్ల నుండి వారం, పది రోజుల్లో లక్షలాది దోమలు తయారవుతాయి. ఇవి చల్లగా ఉండే, నీడగా ఉండే ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకుంటాయి. అంటే మన ఇళ్లల్లో కర్టెన్ల వెనకా, తలుపుల వెనకా, గోడల మాటన విశ్రమించి మధ్యాహ్నం, సాయం సమయాలలో కుట్టడం ప్రారంభిస్తాయి. సాధారణంగా ఈ దోమలు అరమైలు కంటే ఎక్కువ దూరానికి తిరగలేవు. అయితే బస్సుల్లో, రైళ్లల్లో, విమానాల్లో ఇతర వాహనాల్లో చేరి ఎంతదూరమైనా వెళ్తాయి. డెంగీ జ్వరమని అనుమానించినప్పుడు ఆందోళన చెందకుండా వైద్యుని సలహా తీసుకోవడం తప్పనిసరి. అవసరాన్ని బట్టి వైద్యులు రక్తపరీక్షలు చేయించి, చికిత్స ఇస్తారు. డెంగీ లక్షణాలు : 2 నుంచి 7 రోజుల వరకూ జ్వరం తగ్గకపోవడం ఒళ్లంతా తీవ్రమైన నొప్పులుగా ఉండటం (కండరాలలో, కీళ్లలో, తలలో విపరీతమైన నొప్పి వస్తుంటుంది) చర్మంపై ఎర్రటిమచ్చలు ర్యాష్‌లాగా కనిపించడం తెల్ల రక్తకణాలు బాగా పడిపోవడం (ఇది రక్తపరీక్షలో తెలుస్తుంది) హిమోగ్లోబిన్ 16 శాతం కంటే ఎక్కువ ఉండటం బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గిపోవడం (రక్తపరీక్షలో తెలుస్తుంది) ప్లేట్‌లెట్స్ సంఖ్య కూడా బాగా తగ్గిపోతుంది. వీటి సంఖ్య సాధారణంగా 1.5 లక్షల నుంచి 4.5 లక్షలు ఉండాలి. కానీ... డెంగీ వ్యాధిలో ప్లేట్‌లెట్స్ సంఖ్య బాగా తగ్గిపోతుంది. ప్లేట్‌లెట్స్ అనేవి రక్తస్రావం జరగకుండా ఆపే కణాలు. అవి తగ్గడం వల్ల శరీరం లోపలి భాగాల్లో రక్తస్రావం జరిగి, అది ప్రమాదకరమైన పరిస్థితికి దారితీయవచ్చు. జ్వరం వచ్చిన మూడో రోజు నుంచి రెండో వారాంతం వరకు ఎప్పు డైనా ఇలా జరగవచ్చు. (అయితే మొదటివారం లోనే ఇది కనిపించే అవకాశాలు ఎక్కువ). ఇది ప్రమాదకరమైన దశ. ఈ సమయంలో రోగిని పర్య వేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలి. చికిత్స: లక్షణాలను బట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది. రోగికి బాగా విశ్రాంతినివ్వాలి ఈ జ్వరానికి యాంటీబయాటిక్స్ పనిచేయవు. (కానీ సెకండరీ ఇన్ఫెక్షన్స్ వచ్చినప్పుడు దాన్ని నియంత్రించడానికి తగిన యాంటిబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది). ఐవీ ఫ్లుయిడ్స్ ఇచ్చి బీపీని పడిపోకుండా చూసుకోవడం అవసరం. పారాసిటమాల్ మాత్రలు డాక్టర్ల సూచన మేరకు ఇవ్వాలి పథ్యం అవసరం లేదు. అయితే తాజాగా, వేడిగా ఉన్న ఆహారాన్ని ఇవ్వాలి. జ్వరం రెండు నుంచి ఏడు రోజుల్లో పూర్తిగా తగ్గిపోతుంది. జ్వరం తగ్గినా... తీవ్రమైన కడుపునొప్పి, మలం నల్లగా రావడం, చర్మంలో ఎర్రటి మచ్చలు, ముక్కు నుంచి రక్తం కారడం, ఒళ్లు చల్లబడటం, విపరీతంగా చెమటపట్టడం... ఈ లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకూడదు. వీటిని ప్రమాద సూచికలుగా గుర్తించాలి. వెంటనే ఆసుపత్రిలో చేర్పించి వైద్యులతో చికిత్స ఇప్పించాలి. చికత్సతో పాటు డెంగీ పేషంట్స్ ఫుడ్ డైట్ లో ఫాలో అవ్వాలి. ఈ లక్షణాలున్నప్పుడు సరైన ఆహార నియాలమాలు పాటించగలిగితే శరీరంలో మరే ఇతర భాగాలకు హాని కలగకుండా పూర్తి శరీర ఆరోగ్యాన్ని కాపాడుతుంది. మీరు ఈ డెంగీ ఫీవర్ నుండి త్వరగా కోలుకోవడానికి ఈ ఆహారాలు బాగా సహాయపడుతాయి. డేంగీ లక్షణాలున్నవారు వీటిని ఖచ్చితంగా తినాలనే నియమం లేదు. కానీ వీటిని తీసుకోవడం వల్ల డెంగీ పేషంట్స్ కు కోలుకోవడానికి గొప్పగా సహాయపడుతాయి. మరి అటువంటి ఆహారాలేంటో ఒకసారి చూద్దాం...

**ఆరెంజ్:** డెంగీ రోగికి ఒక మంచి ఆహారం సిట్రస్ పండ్లు, ఆరెంజ్ జ్యూస్ మరియు పండ్లలో పుష్కలమైన విటమిన్ సి మరియు శక్తి నిండి ఉంటుంది. ఆరెంజ్ జ్యూస్ ను తీసుకోవడం వల్ల, ఇది జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. యూరినరీ అవుట్ పుట్ ను మెరుగుపరిచి యాంటీబాడీస్ ప్రోత్సహించి రోగి త్వరగా కోలుకొనేందుకు సహాయపడుతుంది.



**బొప్పాయి:** డెంగ్యు పేషంట్స్ కు బొబ్బాయి ఆకులు చాలా మంచిదని డాక్టర్స్ మరియు నిపుణులు సూచిస్తుంటారు. అందుకు 2తాజా బొప్పాయి ఆకులను తీసుకొని, వాటిని మెత్తగా పేస్ట్ చేసి, వాటి నుండి జ్యూసును తీసి, ప్రతి రోజూ ఉదయం మరియు రాత్రి రెండు చెంచాల జ్యూస్ ను డెంగ్యూ రోగికి ఇచ్చినట్లైతే రోగి త్వరగా కోలుకోవడానికి అవకాశం ఉంది. డెంగీ ఫీవర్ కు ఇది ఒక బెస్ట్ హోం రెమడీ.

**గంజి:** ఈ ప్రాణాంతక వైరస్ తో పోరాడాలంటే డెంగీ రోగికి ఒక బెస్ట్ ఫుడ్ గంజి. గంజి తాగడం వల్ల పేషంట్ లో కొంత శక్తిని, బలాన్ని నింపడానికి సహాయపడుతుంది. గంజి తాగడానికి, మింగడానికి చాలా తేలికగా ఉంటుంది. ఇందులో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి.

**హెర్బల్ టీ:** డెంగీ ఫీవర్ తో బాధపడుతున్న వారు, ఈ ఫీవర్ ను తగ్గించుకోవడానికి ఒక మంచి మార్గం నేచురల్ హెర్బల్ టీ తాగడమే. ఈ హెర్బల్ టీ అల్లం మరియు యాలకులతో తయారు చేయబడి ఉంటుంది. ఇది చాలా అద్భుతంగా ఉపయోగపడుతుంది. ఇది డెంగ్యు పేషంట్స్ కు ఒక మంచి ఆహారం.

**కొబ్బరి బోండాం:** డెంగీ ఫీవర్ తో పోరాడుతున్నప్పుడు, పేషంట్ ఎంత ఎక్కువగా కొబ్బరి బోండాం తాగితే అంత మంచిది. కొబ్బరి నీళ్ళు శరీరం ద్వారా కోల్పోయిన ఎలెక్ట్రోలైట్స్ మరియు ఇతర ట్రేస్ మినిరల్స్ ను నింపి శరీరంను డీహైడ్రేషన్ నుండి కాపాడుతుంది.

**వెజిటేబుల్ జ్యూస్:** డెంగ్యు ఫీవర్ తో బాధపడుతున్న పేషంట్స్ కు ఒక మంచి ఆహారం తాజాగా ఉండే క్యారెట్, కీరదోస జ్యూస్ లు మరియు గ్రీన్ లీఫీ వెజిటేబుల్. నిపుణుల ప్రకారం మనుషులకు కావల్సిన పుష్కలమైన న్యూట్రీషియన్ వీటి ద్వారా అందుతుందని, దాంతో పేషంట్స్ త్వరగా కోలుకుంటారని సూచిస్తుంటారు.


**పండ్ల రసాలు:** డెంగ్యు పేషంట్స్ కు చాలా ఆరోగ్యకరమైన ఆహారం విటమిన్ సి ఫుడ్స్. రోగి యొక్క రోగనిరోధక శక్తిని పెంపొంధించుకోవడానికి విటమిన్ సి బాగా సహాయపడుతుంది మరియు అడ్రినల్ హార్మోన్స్ నిర్మాణం కోసం ఇది చాలా ముఖ్యమైనవి.స్ట్రాబెర్రీ, జామకాయ,కివి మరియు బొప్పాయి వంటి సి విటమిన్ ఆహారాలు లైఫో సైట్స్ ఉత్పత్తిలో సహాయపడుతాయి . ఇది కూడా బాక్టీరియా మరియు వైరస్ మీద ప్రత్యక్షప్రభావం కలిగి ఉంటుంది.

**ప్రోటీన్ రిచ్ ఫుడ్:** డెంగ్యు ఫీవర్ తో బాధపడే వారికి ప్రోటీన్ రిచ్ ఫుడ్స్ చాలా అవసరం. పాలు, డైరీప్రొడక్ట్స్, గుడ్లు వంటివి చాలా ముఖ్యం. ఈ వైరస్ తో పోరాడాలంటే డెంగ్యు పేషంట్ చేపలు మరియు చికెన్ కూడా తినడం వల్ల సహాయపడుతుంది.


**సూప్స్:** డెంగ్యు ఫీవర్ తో బాధపడే వారికి కావల్సిన శక్తిని, బలాన్ని అందివ్వడానికి సూప్స్ చాలా బాగా ఉపయోగపడుతాయి. జాయింట్ పెయింట్స్, కండరాల నొప్పుల నివారించడానికి, పేషంట్స్ లో ఆకలిని మరియు రుచిని కలిగించడానికి ఇవి బాగా సహాయపడుతాయి.

**నిమ్మరసం:** డెంగ్యు ఫీవర్ తో బాధపడేవారిలో శరీరంలోని హానికర వైరస్ మరియు టాక్సిన్స్ ను తొలగించడానికి నిమ్మరసం బాగా సహాయపడుతుంది. ఈ జ్యూస్ తాగడం వల్ల శరీరంలో ఉండే వైరస్ మూత్రం ద్వారా బయటకు విసర్జింపబడుతుంది. మరియు శరీరంలోకి వైరస్ చేరికను తగ్గిస్తుంది.

# రుగ్మతలకు దివ్యౌషధం !



వేసవి కాలం వచ్చిందంటే చాలు కర్బూజాలు, మామిడి, పుచ్చకాయలు దర్శనమిస్తుంటాయి. వీటిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గవి మాత్రం కర్బూజ పండ్లు. ఇవి మామిడి పళ్లంత రంగూ రుచీ ఉండవు, పుచ్చకాయలంత ఆకర్షణీయంగానూ కనిపించవు. అందుకే చాలామంది దృష్టి వీటి మీదకు పోదు. కాని కర్బూజ పండ్లు ఆరోగ్యానికి చాలా మంచివి. పుచ్చకాయలో శక్తి చాలా తక్కువ. ప్రొటీన్ తక్కువ. కొవ్వు తక్కువ. కొలెస్టరాల్ అసలు ఉండదు. పిండి పదార్థాలు ఎక్కువ. పీచు పదార్థాలు ఎక్కువ. సోడియం తక్కువ. విటమిన్లలో విటమిన్-ఎ, ఫోలేట్, విటమిన్-సిలు ఎక్కువ. రాబోయే వేసవి కాలంలో ఎండలో దాహార్తిని తీర్చుకోవాలంటే మొదట ప్రాధాన్యం ఇచ్చేది ఎర్రని పుచ్చకాయలకే. అన్ని సీజన్లలోనూ ఇవి దొరుకుతున్నా ఈ కాలంలో లభ్యమయ్యే వాటికి నాణ్యత, రుచీ ఎక్కువ. ఎ, బి, మరియు సి విటమిన్లు , పొటాషియం పుష్కలంగా ఉండే పుచ్చకాయ నుంచి ఎలక్ట్రోలైట్లు సమృద్ధిగా అందుతాయి. ఇంకా చెప్పాలంటే తక్కువ కెలోరీలు, ఎక్కువ పోషకాలు ఉంటాయి. పుచ్చకాయ జూస్ తాగేందుకు అనువైన పానీయం. ఎందుకంటే, అందులో 92% నీరు ఉంటుంది, పైగా కొలెస్ట్రాల్ లాంటివి అందులో ఉండవు.



అది వెంటనే తన ప్రభావాన్ని చూపిస్తుంది. ఎందుకంటే నీటిని కలిగి ఉండడం వల్ల. బి విటమిన్లు శరీరానికి శక్తినందిస్తే.. పొటాషియం గుండెకు మేలు చేస్తుంది. వడదెబ్బ బారినపడి శరీరం నిస్తేజం అయిపోకుండా కాపాడుతుంది. మీరు నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం. పుచ్చకాయలో కొన్ని యాంటీ ఆక్సిడెంట్లు నిండి ఉన్నాయి.

ఇది పుచ్చకాయలు విరివిగా దొరికే కాలం. మృదువుగా, తీయగా, రసపూరితమైన పుచ్చకాయ ఈ వేసవికి చాలా ఉపయోగకరమైనది. వాటిని తింటే దాహం తీరిపోతుంది. అందులో సందేహం లేదు. కానీ, వాటిలో యాంటీ ఆక్సిడెంట్‌లు పుష్కలంగా ఉన్నాయన్న సంగతి మీకు తెలుసా?


**1. పురుష హార్మోనులను రెట్టింపు చేస్తుంది:** వేసవి తాపాన్ని తగ్గించే పుచ్చకాయ (తర్బూజా)లో ఉండే లైకోపీన్ అనే పదార్థం పురుషుల్లో వీర్యకణాల ఉత్పత్తిని పెంచుతుందని తాజా పరిశోధనల ద్వారా తెలుస్తోంది. అంతేగాకుండా ఈ లైకోపీన్ వీర్యకణాలు ఎక్కువసేపు సజీవంగా ఉండేలా కూడా చేస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. మామూలుగా పుచ్చకాయలో 92 శాతం నీళ్లే ఉంటాయి. అందులోని 8 శాతం లైకోపీన్ మాత్రం వీర్యవృద్ధిని పెంచటమేగాకుండా ఆరోగ్యానికి ఉపయోగపడే ఎన్నో సులక్షణాలను కలిగి ఉంది.

**2. బ్లాక్ హెడ్స్** : చర్మ రక్షణలో బాగంగా ముఖం, ముక్కు మీద ఏర్పడే బ్లాక్ హెడ్స్ ను తొలగించడం సహాయపడుతుంది.

**3. గుండెకు** : గుండెపోటు రిస్కును పుచ్చకాయతో తగ్గించుకోవచ్చు. పుచ్చకాయలో ఉండే ఫోలేట్‌వల్ల, విటమిన్-బి6వల్ల మహిళల్లో గుండె పోటు సంఘటనలు దాదాపు 50శాతం తగ్గినట్లు అధ్యయనాల్లో తేలింది. శరీరానికిహానికరమైన కొలెస్ట్రాల్ ఏర్పడటాన్ని అడ్డుకుంటాయి.

**4. వద్ధాప్యం:** వృద్ధాప్య ఛాయలను పోగొడుతుంది: వాటర్ మెలోన్ లో ఉండే లైకోపిన్, విటమిన్ సి మరియు విటమిన్ ఎ శరీరంలోని ఫ్రీరాడికల్స్ ను తొలగించడంలో బాగా సహాయపడుతుంది. అంలాగే యాంటీఆక్సిడెంట్స్ కూడా ముడతలను, కళ్ళ కింద చారలను తొలగిస్తుంది.

**5. కీళ్ళ నొప్పులు:** బలమైన కీళ్ళ కోసం: దోసకాయలోని సిలికా కీళ్ళ జాయింట్లను, సహాయపడే కణజాలాలకు పటిష్టం చేయడానికి బాగా సహాయపడుతుంది. శరీరంలో యూరిక్ ఆమ్లం పెరుకోవడం ద్వార వచ్చే కీళ్ళ జబ్బులకు కీర రసంలో క్యారెట్ రసం కలిపి తాగితే ఎంతో మంచిది. ఆర్థరైటిస్ మరియు గౌట్ నివారణకు: ఆర్థరైటిస్ మరియు గౌట్ నొప్పి నివారణకు ఉపశమనం కలిగించే యూరిక్ ఆమ్లస్థాయిని





తగ్గిస్తుంది. ఎగ్జిమ , గౌట్ రోగులు క్రమం తప్పకుండ కీర రసం తీసుకోవడం వల్ల పలితం ఉంటుంది.

**6.ఫ్లూ:** మనందరికి తెలుసు జలుబు, దగ్గు, జ్వరం ఇటువంటి సాధారణ జబ్బుల నుండి బయటపడాటానికి వ్యాధినిరోధక శక్తి పెంచుకోవడానికి, సరైన ఆహార, పానియాలు తీసుకోవాలని. ఐతే అందులో కూడా ఫ్లూ నివారణకు సరైన ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. అటువంటి సమయంలో పుచ్చకాయ బాగా సహాయపడుతుంది. ముక్కు మరియు గొంతు, మ్యూకస్ పొర యొక్క వాపు కూడా దోసకాయ గింజలు తగ్గిస్తుంది. దోసకాయ గింజలను పొడి చేసి నీటిలో కలిపి త్రాగడం వల్ల ఈ సమస్యలను సమర్థవంతంగా నియంత్రించవచ్చు. **7. బరువు తగ్గడానికి:** కాని కర్బూజ పండ్లు ఆరోగ్యానికి చాలా మంచివి. కొవ్వు పదార్థాలు అత్యంత తక్కువుగానూ, పీచు పదార్థాలు అధికంగానూ ఉండే ఈ పండు బరువు తగ్గాలనుకునే వారికి వరం లాంటింది.

**8. కేశ సంరక్షణకు:** పుచ్చకాయలో ఉండే సిలికాన్ మరియు సల్ఫర్ జుట్టు ఆరోగ్యంగా పెరగడానికి సహాయపడుతుంది. పాలకూర, క్యారెట్ రసాలకు కాస్త కీర రసం కలపి తరచు తాగితే శిరోజాలు చక్కగా పెరుగుతాయి.

**9. పళ్ళు మరియు మంచి చిగుళ్ళ ఆరోగ్యానికి:** దంతాల ఆరోగ్యానికి మరియు చిగుళ్ళ నుండి రక్తం కారుట, దంత క్షయం వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి పుచ్చకాయ రసం చాలా సహాయపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ ఆరోగ్యకరంగా ఉంచుతుంది.

**10. క్యాన్సర్:** పుచ్చకాయలో ఎరుపు రంగుకు కారణమైన లైకోపీన్ అనే కెరటినాయిడ్ పదార్థం ఉంటుంది. ఇది క్యాన్సర్లను రానివ్వకుండా కాపాడటమే కాకుండా గుండె జబ్బులను, మ్యాక్యులర్ డీజెనరేషన్‌ను (కంటిలోపలి పొర క్షీణించి పోవటం) సైతం నిరోధిస్తుంది. క్యాన్సర్ నివారణకోసం పుచ్చకాయను వాడుకోవచ్చు.

పుచ్చకాయలో బీటాకెరోటిన్ ఎక్కువ మొత్తాల్లో ఉంటుంది కాబట్టి క్యాన్సర్ నిరోధకంగా పనిచేస్తుంది. ముఖ్యంగా గొంతు, ఊపిరి తిత్తుల క్యాన్సర్లను, స్వరపేటిక క్యాన్సర్లను పుచ్చకాయలోని బీటా కెరోటిన్ గణనీయంగా నిరోధించినట్లు అమెరికన్ క్యాన్సర్ సొసైటీ నివేదికల్లో ప్రచురించింది. మరో ఆసక్తికరమైన అంశం ఉంది. ఇదే బీటాకెరోటిన్ పదార్థాన్ని సప్లిమెంట్ల రూపంలో వాడినప్పుడు ఈ ప్రయోజనం కనిపించలేదు.




# చిత్రభాను

## మహిళగా స్పందిస్తున్నా

హృతిక్ రోషన్, కంగనా రనౌత్ లీగల్ వివాదం రోజురోజుకూ పెద్దదైపోతోంది. హృతిక్-కంగన 'ఎఫైర్'కు సంబంధించి కొన్ని ఆసక్తికర విషయాలు బయటపడుతున్నాయి. ఒకప్పుడు హాట్ లవర్స్‌గా ముద్రపడిన వీరిద్దరి మధ్య ఏం జరిగిందనే దానిపై అనేక రహస్యాలెన్నో వెలుగుచూస్తున్నాయి. ఈ వివాదంలో మొదటి నుంచి హృతిక్ ఒకటే మాట చెప్తున్నాడు. తనకు కంగనతో వృత్తిపరమైన సంబంధమే కానీ, వ్యక్తిగత సంబంధం లేదని, అలాంటి ఉద్దేశంతో ప్రవర్తించలేదని మొదటి నుండి వాదిస్తున్నాడు.అయితే కంగన వాదన వేరేగా ఉంది . పరస్పర విమర్శలతో గతేడాది వార్తల్లో ఈ జంట పతాక శీర్షికలో నిలిచింది. అయితే తప్పంతా క్వీన్‌దేనంటూ ఆమె మెయిల్స్ సాక్ష్యాలుగా చూపించాడు హృతిక్. అప్పటి నుంచి ఆ అంశం క్రమక్రమంగా గప్‌చుప్ అవుతూ వచ్చినా ఈ మధ్య కంగన నటించిన "సిమ్రన్" సినిమా ప్రమోషన్లలో మళ్ళీ ఈ వివాదం తెరమీదకి వచ్చింది. అంతే మళ్ళీ బాలీవుడ్ మరోసారి ఈ ప్రేమ యుద్ధం వైపు చూపు తిప్పక తప్పలేదు. ఈ నేపథ్యంలోనే మరో బాలీవుడ్ నటి యామీ గౌతమ్ తన ఫేస్‌బుక్‌లో ఓ పోస్ట్ పెట్టింది. హృతిక్‌తో కాబిల్ చిత్రంలో నటించిన యామీ గౌతమ్ చేసిన పోస్ట్ పరోక్షంగా ఆయనకు మద్దతునిస్తున్నట్లే కనిపిస్తోంది. చరిత్ర ఆధారంగా మగాడిదే తప్పనడం సబబు కాదని, ఇలా చేస్తే లింగ సమానత్వం కోసం చేస్తున్న పోరాటం తప్పుదోవ పడుతుందని, ఇద్దరు వ్యక్తుల మధ్య విషయాన్ని సామాజిక అంశంగా మార్చొద్దని ఆమె పోస్ట్‌లో పేర్కొంది. సాధారణంగా సోషల్ మీడియాలో నేను పెద్దగా మాట్లడను. కానీ ఒక మహిళగా ఈరోజు మాట్లాడాల్సిన అవసరం వచ్చింది. బాలీవుడ్‌లో ఇద్దరు ప్రముఖుల వివాదం నన్ను స్పందించేలా చేస్తోంది. వారిలో ఒకరితో కలిసి నేను పనిచేశాను. అలాగని అతనికి మద్దతుగా నేను మాట్లాడటం లేదు. ఒక మహిళగా స్పందిస్తున్నాను. నాకు చట్టాల గురించి పెద్దగా తెలియదు. ఈ వివాదం గురించి కూడా పెద్దగా తెలియదు. కేవలం మీడియాలో వచ్చిన విషయాలు మాత్రమే తెలుసు. వాటిని బట్టి చూస్తే ఆ ప్రముఖుల వివాదం లింగ సమానత్వ అంశంగా మారినట్టు అర్థమైంది.

ఇప్పటికే సమాజం అతన్ని నేరస్థుడిగా ఖరారు చేసింది. ఏళ్ల తరాలుగా మహిళల మీద జరుగుతున్న వేధింపు ఘటనల ఆధారంగా సమాజం ఇలాంటి నిర?యం తీసుకోవడం సబబు కాదు. నిజానిజాల విచారణ పూర్తి కాకముందే ఇలా చేయడం ఎంతవరకు కరెక్ట్? లింగ సమానత్వం అనే భావన నిజాలను కప్పేస్తోంది. దీని వల్ల లింగ భేదానికి వ్యతిరేక జరుగుతున్న పోరాటం తప్పుదోవ పట్టే అవకాశాలు ఉన్నాయి.

## బాలయ్య ఇక కొట్టరంటే కొట్టరంట...



నందమూరి వారసుడు, బాక్సాఫీస్ బొనాంజా బాలకృష? ఇటీవల వివాదాల్లో చుక్కుకుంటున్నారు. ఇటీవల కాలంలో అభిమానులపై చేయి జేసుకొంటూ పలుమార్లు వార్తల్లో నిలిచారు. దాంతో అభిమానులను బాలయ్య కొట్టడమనేది అటు మీడియాలోనూ, ఇటు సోషల్ మీడియాలోనూ చర్చనీయాంశమైంది. అభిమానులపై దాడి చేస్తున్నారనే విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఇటీవల బాలయ్య పలువురితో తన అభిప్రాయాలను పంచుకొన్నారు. తాను చేయి చేసుకోవడంపై ఆయన వివరణ ఇచ్చారు. అదేమిటంటే.. నాకు అభిమానులకు దగ్గరగా ఉండటమంటే చాలా ఇష్టం. ఫ్యాన్స్ అంటే నాకు ప్రాణం. అందుకే వారికి దగ్గరగా ఉంటాను. నేను ఇచ్చిన చొరవను కానీ కొన్నిసార్లు కొందరు దుర్వినియోగం చేస్తారు. ఎవరైనా నా వద్ద హద్దులు అతిక్రమిస్తే నాకు కోపం వస్తుంది అని చెప్పారు. నేను అభిమానుల మధ్యకు వెళ్లినప్పుడు వారు చేసే కొన్ని పనులు నన్ను చాలా విసిగిస్తాయి. వారు చేసే పనులు ఇతరులకు గానీ, మీడియా కంటికి కనిపించవు. నా వద్ద హద్దు మీరిన వారిని ఒక్కటి వేస్తే దానిని గోరంతలు కొండంతలు చేస్తారు. ఆ తర్వాత బాలయ్య అలా కొట్టాడు.. ఇలా కొట్టాడు అని ఆ ఘటనను మీడియాలో హైలెట్ చేస్తారు. ఈ విషయంలో నేను ఓ విషయాన్ని స్పష్టంగా చెప్పాలనుకొంటున్నాను. అందరు హీరోల మాదిరిగా నా చుట్టూ రక్షణగా బౌన్సర్లను ఉపయోగించుకొను. అది మీరు గమనించే ఉంటారు. ఎందుకంటే నా అభిమానులకు దూరంగా ఉండటం అసలే నాకు ఇష్టం ఉండదు. కొన్నిసార్లు బౌన్సర్ల వల్ల కొన్ని చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఏదో ఒక ఈవెంట్ సందర్భంగా నా అభిమానులపై కొందరు బౌన్సర్లు చేయిచేసుకొన్నారు. అప్పటి నుంచి బౌన్సర్లను ఉపయోగించుకోవద్దు అని అనుకొన్నాను. ఎందుకంటే నా ఫ్యాన్స్‌ను ఎవరైనా కొడితే నాకు చాలా బాధ కలుగుతుంది. అందుకే అలాంటి పద్ధతికి దూరంగా ఉంటున్నాను.



## నీ తండ్రికి ఆ ఫోటోలు చూపిస్తావా?

బాలీవుడ్ బ్యూటీ ఇషా గుప్తా ఇటీవల కాలంలో తన సోషల్ మీడియా పేజీలో పోస్టు చేస్తున్న హాట్ ఫోటోలు అందరినీ ఆశ్చర్య పరుస్తున్నాయి. ఇషా ఇంత హాట్ అండ్ సెక్సీగా అందాలు ఆరబోస్తుంటే కొందరు ఎంజాయ్ చేస్తుంటే... కొందరు మాత్రం మరీ ఇలాంటి ఫోజులా? అంటూ ఆమెను విమర్శిస్తున్నారు. కొందరు చేస్తున్న కామెంట్లు మరీ దారుణంగా ఉన్నాయి. ఆమెను నీతి తప్పిన స్త్రీగా అభివరి?స్తూ తిట్టి పోస్తున్నారు. ఆ విమర్శలను ఆమె పెద్దగా పట్టించుకోలేదు కానీ... ఇటీవల తాను ఎయిర్ ఫోర్స్ డే సందర్భంగా పెట్టిన ఓ పోస్టు పట్ల ఓ వ్యక్తి స్పందించిన తీరుపై ఇషా గుప్తా ఫైర్ అయింది. 'ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్ కూతురును అయినందకు గర్వంగా ఉంది. ఆఫ్ స్క్రీన్ రియల్ హీరోలు వారే. దేశాన్ని ప్రొటెక్ట్ చేస్తున్న వారికి సెల్యూట్' అంటూ ఇటీవల ఎయిర్ ఫోర్స్ డే సందర్భంగా ఇషా గుప్తా ఓ పోస్టు చేసింది. ఎయిర్ ఫోర్స్ డే గురించి ఇషా గుప్తా పెట్టిన పోస్టుపై ఓ వ్యక్తి స్పందిస్తూ..... 'నువ్వు ఎప్పుడూ స్కిన్ షో ఎందుకు చేస్తున్నావు? ఇది నీ పర్సనల్ అని నాకు తెలుసు.... కానీ మీ నాన్న నువ్వు పోస్టు చేసిన అలాంటి ఫోటోలు చూస్తే ఎలా ఫీలవుతారో ఊహించుకో' అంటూ ఓ కామెంట్ పెట్టాడు. నీ లాంటి వారికి సోల్జర్స్ అవసరం ఏమిటో కూడా తెలియదు. నా కళ్లు తెరిపించావు. నన్ను మరింత జాగృతం చేశావు అని అర్థం వచ్చేలా ఇషా రిప్లై ఇచ్చింది. ఈ మధ్య సోషల్ మీడియాలో సెలబ్రిటీలను ట్రోల్ చేస్తూ పోస్టు చేయడం చాలా మందికి టైమ్ పాస్ అలవాటుగా మారిందని.... ఆయా స్టార్స్ అభిమానులు చెబుతున్నమాట. ఇషా గుప్తా ఇచ్చిన రిప్లై తర్వాత..... చాలా మంది ట్రోలర్స్ ఏదైనా కామెంట్స్ చేసే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇషా తగిన రిప్లై ఇచ్చిందని ఆమె అభిమానులు అంటున్నారు. సోషల్ మీడియాలో తమను ట్రోల్ చేస్తున్న వారికి ప్రతి సెలబ్రిటీ ఇషా గుప్తా తరహాలో గట్టిగా సమాధానం చెప్పాలని, అప్పుడే ఇలాంటివి ఆగుతాయని అంటున్నారు.

### నో సెన్సార్, నో కటింగ్స్.... మూడున్నర గంటల

## 'అర్జున్ రెడ్డి' రిలీజ్ డేట్ ఫిక్స్!



విజయ్ దేవరకొండ, శాలిని పాండే హీరో హీరోయిన్లుగా సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో తెరకెక్కిన 'అర్జున్ రెడ్డి' ఇటీవల విడుదలై తెలుగు సినిమా చరిత్రలో ఓ సంచలనం అయింది. సినిమా స్టోరీ రొటీనే అయినా... సినిమాను తెరకెక్కించిన తీరు భిన్నంగా ఉండటంతో సూపర్ హిట్ అయింది. ఈ సినిమాలో వాడిన కొన్ని సీన్లు, డైలాగులపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. అనేక వివాదాలు చెలరేగాయి. సెన్సార్ బోర్డు వాటిని తొలగించింది కూడా.

దీంతో పాటు సినిమా నిడివి కూడా మూడున్నర గంటలకు పైగా తెరకెక్కించారు. అయితే థియేటర్లలో అంత సమయం ప్రదర్శించడం కష్టం కాబట్టి 3 గంటలకు కుదిరించారు. 'అర్జున్ రెడ్డి' సినిమా చూసిన చాలా మంది.... సినిమా పూర్తిగా ఉంటే బావుండేదని, సెన్సార్ కటింగ్స్ కూడా లేకుంటే మరింత బావుండేదని ఫీలయ్యారు. అలా కోరుకున్న వారి కోరిక త్వరలో నెరవెరబోతోంది. తొలుత డీవీడీ ద్వారా అర్జున్ రెడ్డి అన్ సెన్సార్ వెర్షన్ రిలీజ్ చేద్దామనుకున్నారు. కానీ నిర్మాతల నిర?యం మారింది. అమెజాన్ ప్రైమ్ ద్వారా 'అర్జున్ రెడ్డి' అన్ సెన్సార్డ్, పూర్తి నిడివి ఉన్న సినిమాను ఈ నెల 13న రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

ఆ వెబ్ సైట్లోకి వెళ్లి నేరుగా ఈ సినిమా చూడొచ్చు. విజయ్ దేవరకొండ, శాలిని పాండే హీరో హీరోయిన్లుగా సందీప్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అర్జున్ రెడ్డి'. భద్రకాళి పిక్చర్స్ పతాకంపై ప్రణయ్ రెడ్డి వంగ నిర్మించిన ఈ సినిమా బాక్సాఫీసు వద్ద బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకుంది. సినిమా షూటింగ్ జరిగిన తీరు, షూటింగ్ సమయంలో నటీనటుల, టెక్నీషియన్స్ అనుభవాలను పొందుపరుస్తూ ఓ వీడియో రిలీజ్ చేశారు.

## అమ్మ బ్రహ్మ దేవుడో... కొంప ముంచినావురో...



శ్రీదేవి ఇండియన్ స్క్రీన్ మీద మెరిసిన కాంతి రేఖ మూడున్నర దశాబ్దాల కాలం, 54 ఏళ్ళ వయస్సు ఆమె అందాన్ని ఏమాత్రం తగ్గించలేక పోయాయి. ఇప్పటికీ శ్రీదేవి అంటే ఆనాటి స్థాయి అభిమానంతో ఉండే అభిమానులు ఇప్పటికీ ఉన్నారు. ప్రస్తుతం సీనియర్ నటిగా ఇండస్ట్రీలో తనకంటూ గౌరవ స్థానాన్ని ఏర్పరచుకున్న శ్రీదేవి.... ఒకప్పుడు అతిలోక సుందరిగా ఇండియన్ సినీ రంగాన్ని క్వీన్ లా ఏలిన సంగతి తెలిసిందే. ఒకప్పుడే కాదు ఇప్పటికీ ఆమెలో అందం ఏమాత్రం తగ్గలేదన్న సంగతి ఆమె లేటెస్ట్ ఫొటో చూస్తేనే అర్థమైపోతోంది. కాలం, వయస్సూ అనే మాటలు శ్రీదేవి విషయంలో తమ స్వభావాన్ని మర్చిపోయాయేమో అన్నంతగా ఇప్పటికీ ఆమెలో వన్నె తగ్గని ఆ అందం చూస్తే ఆశ్చర్యం కలగక మానదు. ఇద్దరు కూతుళ్ల తల్లి అయినప్పటికీ.. వారితో పోటీ పడటం ఈ అతిలోక సుందరికే సాధ్యం. వెండితెర వేల్పుగా.. అతిలోక సుందరన్న ట్యాగ్‌కు అచ్చుగుద్దినట్లుగా సరిపోవటం శ్రీదేవికి మాత్రమే సాధ్యమేమో? ఓపక్క కూతుళ్లు వెండితెరను ఏలేందుకు సిద్ధమవుతున్న వేళ.. ర్యాంప్ మీద మెరిసిన శ్రీదేవిని చూసినోళ్లకు నోట మాటరాలేదంతే. సింధూరం.. బంగారం మిక్స్ చేసిన ఫుల్ గౌన్ లో దేవకన్య దిగి వచ్చిందా? అన్నట్లు ఉండటం శ్రీదేవికి మాత్రమే సాధ్యమేమో? వయసు మీద పడుతున్నా.. ఎంతకూ తరగని అందాలతో మెరిసిపోయింది. ర్యాంప్‌కే కొత్త కళను తీసుకొచ్చింది. ర్యాంప్ మీద హొయలు ఒలికించిన శ్రీదేవిని చూసిన అవాక్కు అయ్యారనే చెప్పాలి. తాజాగా బెంగళూరులోని ఓ ప్రముఖ నగల వ్యాపార సంస్థ ఫ్యాషన్ షోను నిర్వహించింది. అందులో సంప్రదాయ వస్త్రాలు.. నగలతో షో నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీదేవి ర్యాంప్ వాక్ చేసి అదరగొట్టటమే కాదు.. కెమేరా సైతం తనను తాను పరవశించిపోయేలా మెరిసిపోయింది. ప్రతి జనరేషన్ కు ఒక అందం ఉంటుందని. కానీ.. జనరేషన్ ఏదైనా.. తన అందంతో ఫిధా చేసే సత్తా శ్రీదేవికి మాత్రమే సాధ్యమేమో? అందగత్తెలందు శ్రీదేవి వేరయా అనుకోక తప్పదు.

# ఢిల్లీలో ఈసారీ నిశ్శబ్ద దీపావళే..!

## బాణసంచాపై నిషేధాన్ని పునరుద్ధరించిన సుప్రీంకోర్టు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంత వాసులు ఈ సారి దీపావళి పండగ నిశ్శబ్దంగా, కాలుష్యరహితంగా జరుపుకోనున్నారు. దిల్లీలో గతేడాది బాణసంచాపై విధించిన నిషేధాన్ని పునరుద్ధరిస్తూ సుప్రీంకోర్టు సోమవారం తీర్పు వెల్లడించింది. నవంబర్ 1 వరకు ఈ నిషేధం కొనసాగుతుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆ తర్వాత నిషేధం తాత్కాలికంగా ఎత్తివేస్తామని పేర్కొంది. కోర్టు తీర్పుతో దిల్లీలో బాణసంచా విక్రయాలను నిలిపివేస్తున్నారు.

పండగలు, ప్రత్యేక సందర్భాల్లో పెద్దమొత్తంలో బాణసంచా ఉపయోగిస్తుండటంతో తీవ్ర వాయు, శబ్ద కాలుష్యం ఏర్పడుతోంది. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొంటూ గతేడాది నవంబర్‌లో దిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో బాణసంచాపై నిషేధం విధించింది సుప్రీంకోర్టు. బాణసంచాలను



విక్రయించే టోకు, చిల్లర వ్యాపారుల లైసెన్సులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే దీనిపై భిన్నాభిప్రాయలు వ్యక్తమవడంతో ఈ ఏడాది సెప్టెంబర్‌లో నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తివేసింది. కాలుష్యం దృష్ట్యా బాణసంచా విక్రయ లైసెన్సులను సగానికి తగ్గించేలా చూడాలని పోలీసులను ఆదేశించింది.

తాజాగా ఈ నిషేధాన్ని తిరిగి కొనసాగించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.

# మిఠాయిలు పంచుకోండి.. టపాసులు పేల్చకండి

## అభిమానులకు యువరాజ్ సందేశం

దిల్లీ: సిక్సర్ల హీరో యువరాజ్ సింగ్ అభిమానులకు చక్కటి సందేశాన్ని పంచాడు. ఈ నెల 19న దీపావళి పండగ జరుపుకొనేందుకు దేశ ప్రజలు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో యువీ దీపావళిని దృష్టిలో పెట్టుకుని సోషల్‌మీడియా ద్వారా ఓ వీడియోను అభిమానులతో పంచుకున్నాడు. నమస్తే. ఈ ఏడాది దీపావళి సందర్భంగా ప్రతి ఒక్కరికీ నాదొక విన్నపం. దయచేసి ఎవరూ టపాసులు కాల్చకండి. గత ఏడాది దీపావళి సందర్భంగా ఏర్పడిన కాలుష్యం కారణంగా ఎంతో మంది అనారోగ్యానికి గురయ్యారు. కాలుష్యమైన గాలిని పీల్చాల్సి వచ్చింది. గత ఏడాది పండుగ సమయంలో నేను ఇంటి నుంచి బయటకు కూడా రాలేకపోయాను. ఇది మనకే కాదు.. మన పిల్లలకు, స్నేహితులకు, తల్లిదండ్రులకు, ఇష్టమైన వారందరికీ మంచిది కాదు. దీపావళి అంటే వెలుగులు విరజిమ్మడం. టపాసులు కాల్చడం ఆపేసి దీపాలు వెలిగించి పండగ చేసుకుందాం. ఇరుగుపొరుగు వారిని ప్రేమతో కౌగిలించుకుని ప్రేమను, సంతోషాన్ని అందిద్దాం. మిఠాయిలు పంచుకుందాం. ఆడు



కుందాం. చిన్నపిల్లలందరూ మాస్క్‌లు ధరించడం మర్చిపోకండి. కాలుష్యం నుంచి మన దేశాన్ని కాపాడుకునేందుకు మనమే బాధ్యత తీసుకోవాలి. అభిమానులందరికీ దీపావళి శుభాకాంక్షలు అని యువీ తెలిపాడు.


### బాసర నుంచి భద్రాద్రి వరకు..

# కార్తీకంలో గోదావరి నదీ హారతి

ఖమ్మం : అత్యంత పవిత్రమైన కార్తీక మాసంలో తెలంగాణ రాష్ట్రంలోని బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరీ నదీ తీర ప్రాంతంలోని పుణ్యక్షేత్రాల్లో గోదావరి నదికి హారతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని గోదావరి హారతి ఉత్సవ సమితి నిర్ణయించింది. హైదరాబాద్ బేగంపేటలోని లైఫ్‌స్టైల్ భవనంలోని హవేలి ఫంక్షన్‌హాల్‌లో సాయంత్రం జరిగిన గోదావరి నది హారతి ఉత్సవ సమితి సమావేశంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడె%న భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు మాట్లాడుతూ



వచ్చే కార్తీక మాసంలో గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని దేవాలయాలు, పుణ్యక్షేత్రాల్లో గోదావరి నదీ హారతి కార్యక్రమం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గోదావరి నది పరిరక్షణకు, కాలుష్యం కోరల



నుంచి కాపాడేందుకు నదీపరివాహక ప్రాంత ప్రజలు తగు చర్యలు చేపట్టాలని అన్నారు.

కార్తీక మాసంలో గోదావరి నదీహారతి కార్యక్రమం గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా భద్రాచలంలో కార్తీక పౌర్ణమి రోజున నవంబర్ 4వ తేదీన నదీ హారతి కార్యక్రమం నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు.

బాసర నుంచి భద్రాచలం వరకు నదీ తీర ప్రాంతంలోని పుణ్యక్షేత్రాల్లో నదీహారతి నిర్వహించే తేదీలను ప్రకటించారు. గోదావరి నది ఉత్సవ సమితి భద్రాద్రి ఛైర్మన్, అంతర్జాతీయ గాంధీపథం అధ్యక్షుడు బూసిరెడ్డి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే కార్తీక పౌర్ణమి రోజున భద్రాచలంలో పెద్ద ఎత్తున నదీహారతి కార్యక్రమం నిర్వహిస్తామని, ఆరోజున ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో గోదావరి హారతి ఉత్సవ సమితి గౌరవ సలహాదారు ఆచార్య మనోహర్‌రావు, రాష్ట్ర కన్వీనర్ వీరగోపాల్, సంయుక్త కన్వీనర్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

### భూ రికార్డుల ప్రక్షాళనతో

# యజమానులకు మేలు

## ప్రత్యేక అధికారి వాకాటి కరుణ వెల్లడి



హైదరాబాద్: భూ రికార్డుల ప్రక్షాళన ప్రక్రియ పటిష్ఠమైన బృందాల నేతృత్వంలో సక్రమంగా జరుగుతోందని భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమ ప్రత్యేక అధికారి, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ చెప్పారు. అర్బన్ జిల్లా కలెక్టరేట్‌లో వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. రికార్డుల శుద్ధీకరణపై క్షేత్రస్థాయిలో రైతుల నుంచి సంతృప్తి వ్యక్తమవుతోందని వివరించారు. ఎన్నో సంవత్సరాల తరవాత ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టారని, దీంతో అసలైన భూ యాజమానులకు మేలు జరుగుతుందని, వారికి టైటిల్ ఇచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తే సమాచారం స్పష్టంగా ఉంటుందని, ప్రక్షాళన అనంతరం రికార్డుల నిర్వహణ తేలికగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 90 శాతం మంది యజమానులకు స్పష్టమైన టైటిల్‌ను అందించవచ్చని వెల్లడించారు. భూమి పూర్తి వివరాలు, రైతులు, యజమానుల వివరాలన్నీ తేటతెల్లమవుతాయన్నారు. అర్బన్ జిల్లా జాయింట్ కలెక్టర్ దయానంద్ మాట్లాడుతూ 11 మండలాల రికార్డుల ప్రక్షాశన కోసం 30 బృందాలను ఏర్పాటుచేశామని చెప్పారు. 124 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటివరకు 65 గ్రామాల్లో ప్రక్షాళన పూర్తయిందని వివరించారు. రూరల్ జిల్లాలో 30 గ్రామాల్లో ఈ ప్రక్రియను పూర్తిచేశామని జేసీ హరిత వెల్లడించారు. ఈ నెలలో మరో 80 గ్రామాల్లో ప్రక్షాళన పూర్తిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అర్బన్ జిల్లా రెవెన్యూ అధికారి కె.శోభ, వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, పాల్గొన్నారు.

# హైదరాబాద్ తరపునే మారిన్




హైదరాబాద్: ప్రతిష్ఠాత్మక ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్(పీబీఎల్) మూడో సీజన్ వేలం ప్రారంభమైంది. హైదరాబాద్ వేదికగా జరుగుతోన్న ఈ వేలంలో 8 ఫ్రాంఛైజీలు పాల్గొన్నాయి. 133 మంది స్వదేశీ, విదేశీ క్రీడాకారులు వేలానికి అందుబాటులో ఉన్నారు. గతేడాది తమ జట్లలో ఉన్న క్రీడాకారుల్లో ఒకర్ని తిరిగి ఎంచుకోవాల్సిందిగా నిర్వాహకులు సూచించగా చెన్నై స్మాషర్స్ పీవీ సింధును తమ వద్దే అట్టి పెట్టుకుంది.

**హైదరాబాద్ తరఫునే మారిన్**

గత ఏడాది హైదరాబాద్ హంటర్స్ తరఫున ఆడిన కరోలినా మారిన్ మరోసారి అదే జట్టుకు సేవలు అందించనుంది. రూ.50లక్షలు వెచ్చించి మారిన్‌ను హంటర్స్ దక్కించుకుంది.

రూ.52 లక్షలతో మహిళల సింగిల్స్ నంబర్‌వన్ క్రీడాకారిణి తై జు యింగ్‌ను అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్ కైవసం చేసుకుంది.

డిసెంబరు 22 నుంచి జనవరి 14 వరకు పీబీఎల్-3వ సీజన్ పోటీలు జరగనున్నాయి. ముంబయి, హైదరాబాద్, లఖ్‌నవూ, చెన్నై, గువాహటి వేదికలుగా ఈ పోటీలు జరుగుతాయి.

# నంది అవార్డుల రచయిత ఇకలేరు



న్యూఢిల్లీ : ప్రముఖ సినీ రచయిత ఎంవీఎస్ హరనాథరావు(72) కన్నుమూశారు. గుండెపోటు రావడంతో ఆయన్ని ఒంగోలులోని రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. 150కు పైగా సినిమాలకు మాటలు అందించిన హరనాథరావు.. ప్రతిఘటన, భారతనారి, అన్న, అమ్మాయి కాపురం సినిమాలకు నంది పురస్కారాల్ని గెలుపొందారు. ప్రముఖ దర్శకుడు టి.కృష్ణ ద్వారా తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం అయిన హరనాథరావు.. దేశంలో దొంగలు పడ్డారు, ఇదా ప్రపంచం, దేవాలయం, రేపటి పౌరులు, మంచిదొంగ, యుద్ధభూమి, రాక్షసుడు, రామాయణం, ధర్మచక్రం, ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ వంటి సినిమాలకు మాటలు అందించారు. అలాగే రాక్షసుడు, స్వయంకృషి వంటి సినిమాల్లోనూ.. రక్తబలి, జగన్నాథ రథచక్రాలు, క్షీరసాగర మథనం, అంతం కాదిది ఆరంభం వంటి నాటకాల్లోనూ హరనాథరావు నటించారు. 1948 జులై 27న గుంటూరులో హరనాథరావు జన్మించారు. గుంటూరులోనే విద్యాభ్యాసం సాగింది. హరనాథరావుకు చిన్నప్పటినుంచే నాటకాల అంటే అభిమానం. చిన్నప్పుడు పలు నాటకాల్లో నటించిన ఆయన.. అనంతరం పలు నాటకాలు రచించారు. కాలేజీ రోజుల్లో దర్శకుడు టి.కృష్ణ, హరనాథరావు మంచి స్నేహితులు. ఈ అనుబంధంతోనే టి.కృష్ణ ద్వారా హరనాథరావు వెండితెరకు పరిచయమయ్యారు.

కాగా, హరనాథరావు మృతి పట్ల తెలుగు సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

# మాదిగల అభివృద్ధికి వెనుకాడబోం

## ఉప ముఖ్యమంత్రి కడియం




హైదరాబాద్: మాదిగలు, మాదిగ ఉపకులాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడబోదని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాకలో ఎమ్మార్పీఎస్-టీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన జాంబవంతుని ఆలయ భూమిపూజ అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. మాదిగలది అభివృద్ధి చెందుతున్న జాతి అని..ఈ జాతి మీద చాలామంది ఈర్ష్య పడుతున్నారని చెప్పారు. అన్ని సమస్యలకు విద్యనే పరిష్కారం చూపుతుందని..అందుకే ప్రభుత్వం బడుగు, బలహీన, మైనార్టీల కోసం గడచిన రెండేళ్లలో 525 గురుకుల పాఠశాలలను ప్రారంభించిందని చెప్పారు. చెప్పులు కుట్టేవారికి, డప్పులు కొట్టేవారికి పింఛన్లను అందజేసేందుకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోనున్నారని చెప్పారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వమే కాలయాపన చేస్తోందన్నారు. నవంబరులో జరగనున్న పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు ఆమోదం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తారని చెప్పారు. కొలనుపాకలోని ఆదిజాంబవుని గుడి నిర్మాణం కోసం సమగ్ర ప్రణాళిక నివేదిక (డీపీఆర్)ను తయారు చేసి పంపాలని సూచించారు. అది అందిన వెంటనే..విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే గొంగిడి సునీత మాట్లాడుతూ ఆదిబాంబవుని ఆలయ నిర్మాణానికి ప్రభుత్వపరంగా చేయూతనిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ మాదిగల హక్కుల సాధనకు రాజీలేని ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ మాట్లాడుతూ ప్రతీమాదిగ ఇంటినుంచి ఒక ఇటుకను ఆలయ నిర్మాణానికి అందించాలని చెప్పారు. కార్యక్రమంలో మందుల సామేల్, మేడి పాపయ్య, మాదిగ ఉపకులాల రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డా.సీహెచ్.రాజమౌళి, జిల్లా అధ్యక్షుడు రామన్, ఎంపీపీ కె.అనసూర్య, సర్పంచి జి.శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు దేవుని రాములు, మోత్కూరి అయిలయ్య, గ్యార నరేష్, చిలుకమారి గణేష్, ఖె%రపాక నాగరాజు, సంగి స్వామి, మామిడాల అంజయ్య, కోటగిరి విఠల్‌గౌడ్, సొంటెం సోములు, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS**, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com